ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 15 మే 2025





జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం వాతావరణ మార్పులలో కారణంగా వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఏకధాటిన భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాల్లో రెండడుగుల మేర రహదారులపై నీరు ప్రవహించింది. పైన చిత్రాల్లో పవర్‌పేట రైల్వేస్టేషన్ వద్ద వర్షం నీటితో కాల్వను తలపిస్తున్న రోడ్డు, ఫైర్ స్టేషన్-పాత బస్టాండ్ ఫ్లయ్‌ఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్.

■ లోపలి పేజీలో..

హ్యాపీ బర్త్ డే



కాళ్ల మండలం పెద అమిరంలో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, చిత్రంలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు

జోష్ ఏదీ?



మహానాడుకు ముందు కమిటీల ఏర్పాటులో వెనుకంజ

తెలుగుదేశం ప్రతీసారి మహానాడును అత్యంత ప్రతిష్టాత్మకంగానే భావిస్తుంది. మహానాడు కంటే ముందు ఈ నెల 17లోపు సంస్థాగత ఎన్నికలను పూర్తి చేయాలని ఇంతకుముందే టీడీపీ మార్గనిర్దేశం చేసింది. సంస్థాగతంగా పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేం దుకు నిర్దేశించిన మార్గంలో కొన్ని నియోజకవర్గాలు ఇప్పటికీ వెను బడ్డాయి. మరికొన్ని ముక్కుతూ, మూలుగుతూ గ్రామస్థాయిలో కమిటీలకు సిద్ధం అయ్యాయి. టీడీపీ ఆవిర్భావం తర్వాత, మహానాడు ఆర్భాటంగా సాగాల్సిన తరుణంలో సంస్థాగత ఎన్నికలు చల్లబడడం ఈ సారి ఆల్‌టైమ్ రికార్డు. అయినా గమ్యం చేరుకోవడానికి అన్ని నియోజకవర్గాలు పోటీపడుతూనే ఉన్నాయి.

- కమిటీల నియామకంలో తప్పటడుగులు
- బూత్ దగ్గర నుంచి క్లస్టర్ వరకు ఇదే పరిస్థితి
- దూకుడుగానే ఉంగుటూరు
- పోలవరం, కైకలూరుల్లో పూర్తిగా వెనుకబాటు
- అధినాయకత్వం నివ్వెరపడేలా పార్టీ నేతల వైఖరి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మహానాడు..ఈ పదం వినబడితే చాలు. సగటు తెలుగు దేశం కార్యకర్త ఉద్రుతలూగుతాడు. మండుటెండను లెక్క చేయకుండా పసుపుజెండాను భుజానికెత్తుకుని ముందు కురుకుతాడు. ఇలాంటి తరుణంలో వయోభేదం ఉండదు. అంతలా క్షేత్రస్థాయి నుంచి ఉప్పొంగిపోతారు. ప్రత్యేకించి అధికారంలో ఉన్న, లేకపోయినా మహానాడంటే దేనిని లెక్క చేయరు. సొంత ఖర్చులతోనే పయనం అవుతారు. ఈసారి ఐదేళ్ల జగన్ సామ్రాజ్యంను కూకటివేళ్లతో పెకిలించి, మార్పుకు స్వాగతం పలుకుతూ, అధికార పగ్గాలు చేపట్టిన ఏడాదిది. కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికీ పార్టీ అంటే ప్రాణం ఇచ్చే కార్యకర్తల నుంచి నేతల వరకు పార్టీ ఆదేశమే శిరోధార్యంగా భావిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాలు మహా నాడు కంటే తాము సూచించిన కమిటీలు నియోజక వర్గం నుంచి క్షేత్రస్థాయి వరకు నియమా కాలు పూర్తి చేయాలని, ఇంతకముందే వివిధ నియోజకవర్గాల బాధ్యులను ఆదేశిం చారు. కానీ ఇప్పటికీ సరైన గడువు లేని తరుణంలో పలు నియోజకవర్గాలు ఈ అంశంలో దూసుకెళ్లాయి.

ఉంగుటూరు నియోజక వర్గంలో జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుం డగా, ఇదే నియోజకవర్గంలో టీడీపీ బూత్, క్లస్టర్, యూనిట్ కన్వీనర్ల నియామకంలో రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉంది. ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఈ నియోజకవర్గ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు తమ సమర్థతను చాటారు. రాష్ట్రస్థాయిలోనే ఉంగుటూరు నియోజకవర్గం బుధవారం నాటికి ఏడో స్థానంలో నిలిచింది. బూత్ స్థాయిలో కమిటీల నియమాకంలో జిల్లాలో తొలి వరుసలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో పార్టీ ఇప్ప టికీ వివిధ కమిటీల నియమాకంలో ఏయే నియోజకవర్గాలు ముందు వరుసలో ఉన్నాయా, లేక వెనుకబడి ఉన్నాయా అనేది ఏరోజుకారోజు టీడీపీ అధిష్ఠానం ఆరా తీస్తూనే వచ్చిం ది. ఈ క్రమంలోనే బూత్, క్లస్టర్, యూనిట్ల ఏర్పా టులో రాష్ట్ర స్థాయిలో ఉంగు టూరు నియోజకవర్గంలో ఏడో స్థానంలో నిలవగా, ప్రస్తుతానికి ఏలూరు 19, చింతలపూడి 29, దెందు లూరు 64 స్థానాల్లో ఉన్నాయి. పార్టీ ఆదేశానుసారం నియోజ వర్గాల్లో కమిటీల నియమాకాలు జెట్ స్పీడ్‌లో సాగాల్సి ఉండగా, ఇలాంటి పరిస్థితి చాలా నియోజకవర్గాల్లో కనిపించడం లేదు. జిల్లాను ప్రాతిపదికగా తీసుకుంటే ఉంగు టూరు తొలి స్థానంలో, కైకలూరు చిట్టచివరి స్థానాల్లో నిలిచాయి. తొలుత కుటుంబ సాధికార సారథులు నియ మాకంలో అనేక నియోజకవర్గాల్లో తడబాటే కనిపించింది. పార్టీ నిర్దేశించినట్టుగా ప్రతీ 50 మందికి ఒక్కరు చొప్పున సారథులను నియమించాల్సి ఉంది. దీనిలో జిల్లా వ్యాప్తంగా అనేక నియోజకవర్గాలు వెనుకబడి ఉండటంతో పార్టీ గుర్తించి ఆయా నియోజకవర్గాల్లో నేతలను అప్రమత్తం చేశారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో కమిటీలు పూర్తి చకచకానే సాగుతోంది.

ఆ..రెండింటిలోనూ వెనుకడుగే..

క్షేత్రస్థాయిలో కమిటీల ఏర్పాటులో కైక లూరు, పోలవరం నియోజకవర్గాల్లో వెనుక బాటుతనం కనిపిస్తోంది. గతంలో గ్రామ కమిటీల దగ్గర నుంచి నియోజ కవర్గం వరకు ఎడాపెడా వేసేవారు. కానీ ఈసారి పోలవరం నియోజక వర్గంలో గత ఎన్నికల్లో జనసేన, కైకలూరులో బీజేపీ తమ ఎమ్మెల్యే లను గెలిపించుకున్నాయి. దీంతో టీడీపీ కైకలూరులో పట్టు కోల్పోయింది. కనీసం కమి టీల ఏర్పాటు దిశగా ముందడగు వేయలేక పోతున్నారు. రాష్ట్రస్థాయిలో కైకలూరుకు 146వ స్థానం దక్కగా, పోలవరానికి 124వ స్థానం దక్కింది. ఆఖరికి బూత్ కమిటీల దగ్గర నుంచి ఏ ఒక్కస్థానంలోనూ కమిటీ వేయలేక కైకలూరులో పూర్తిగా చతికిల పడ్డా రు. ఈ దశకు రావడానికి పార్టీ అధి నాయ కత్వం ముందు నుంచి జాగ్రత్త పడక పోవ డం ఒక కారణమైతే, క్షేత్రస్థాయి నేతలు కాడి పడేయడం ఇంకో కారణం. జిల్లాలో కైకలూ రు పూర్తిగా దిగజారిపోతే, పోలవరం అంతం త మాత్రంగా నడుస్తోంది. ఇక్కడ 284 బూత్ కమిటీలకు కేవలం 13 వేసి చేతులు దులుపుకున్నారు. క్లస్టర్, యూనిట్స్‌ల్లోను ఇదే పరిస్థితి. ఏలూరు జిల్లా మిగతా నియో జకవర్గాల్లో పరిస్థితి కాస్తంత మెరుగ్గా ఉం డగా ఈ రెండింటిలో పూర్తిగా నిరాశాజనకం.

రామశింగవరం భూముల కేటాయింపు నిలుపుదల

ఏలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రామశింగవరంలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు 2016లో ఏపీఐఐసీకి కేటాయించిన 173 ఎకరాల 60 సెంట్ల భూమి కేటాయింపు ప్రక్రియను నిలుపుదల చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్ర టరీ జి.జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అప్పట్లో 59వ జీవో ప్రకారం రెవెన్యూ శాఖ అసైన్ చేయగా, ఇది అటవీభూమి అని ఆ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రెవెన్యూదా, అటవీశాఖదా అనేది తేలకపోవడంతో ఆధారాలు లేక పారిశ్రామికవాడకు బదలాయింపు చేసిన జీవోను నిలుపుదల చేస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏపీఐఐసీకి కేటాయింపు చేసిన భూములపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన అభ్యర్థన మేరకు సీసీఎల్ఏ ఈ నిర్ణయం తీసు కున్నారు.

మూడు మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలు

■ లోపలి పేజీలో..

ఉంగుటూరు, దెందులూరు, ఏలూరుకు నియామకాలు

రిజిస్ట్రేషన్ల సేవలు పారదర్శకం.. సులభతరం



- దళారులను నమ్మి క్రయ, విక్రయాల్లో అలసత్వం వద్దు
- స్లాట్‌తో సగటున 78 రిజిస్ట్రేషన్లు
- సెలవు రోజుల్లో తప్ప అన్ని రోజుల్లో సేవలు
- జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు
- 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'కు విశేష స్పందన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల క్రయ, విక్రయాలకు రిజిస్ట్రేషన్లలో జాప్యానికి చోటు లేదు.. స్లాట్‌లో బుక్ చేసుకుంటే పావుగంటలోనే రిజిస్ట్రేషన్‌ను పార దర్శకంగా, సులభతరంగా చేస్తున్నాం. మధ్య దళారులను, ఇతర మోసగాళ్ల చేతిలో పడకుండా ఏవైనా వివరాలు తెలుసుకోవా లంటే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సిబ్బందిని కక్షిదారులు కలిసి తెలుసుకోవడం ఉత్తమ మని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు సూచించారు. స్లాట్ విధానం అమల్లోకి రావడంతో సగటున రోజు 78కు పైబడి రిజిస్ట్రేషన్లు సులభంగా చేస్తున్నామన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటలకు స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ల వ్యవహారాల్లో సందేహాలు, నిషేధిత, ఇతర భూముల సంబంధించిన అంశాలపై బుధవారం 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

- కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్ వెండర్లు స్టాంప్ డ్యూటీలు కన్నా ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి.

- రహీమ్, కైకలూరు

రిజిస్ట్రార్ : దీనిపై స్వయంగా విచారణ చేసి యాక్షన్ తీసుకుంటాం.

- సీనియర్ సిటిజన్లు తమ పిల్లలకు ఆస్తులను రాయకుండా, బయటకు వారికి రాస్తున్నారు.వృద్ధుల నుంచి ఆస్తులను పొందడానికి చట్టం ఉందా?. రిజిస్ట్రేషన్ల విషయంలో విధి విధానాలపై రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ఆడియో రికార్డిం గ్ ద్వారా బయటకు తెలిసేలా ఏర్పాటు చేస్తే ఉపయోగకరం

- ఇ.సాంబశివరావు, ఏలూరు

రిజిస్ట్రార్ : 60 ఏళ్ల దాటిన వృద్ధులను సరిగ్గా చూసుకుంటే ఆర్డీవో కోర్టులో కమిటీకి అప్లయ్ చేసుకుని, ఆస్తులను తమ పేరును రాయించుకునే అవకాశం ఉంది. ఇది సివిల్ మేటర్ మేము జోక్యం చేసుకోకూడదు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆడియో రికార్డింగ్ ద్వారా విధి,విధానాలను తెలిపేందుకు ఉన్నతాధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటాం.

- గ్రామకంఠం భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చు? దానికి పట్టాలు ఇస్తారా?

- టి.నారాయణ, పెదపాడు

రిజిస్ట్రార్ : గ్రామకంఠం భూములకు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. పట్టాలు ఇవ్వడం అనేది మాకు సంబంధం లేదు.

- బూరుగుగూడెంలో మాకు సర్వే నెంబరు 141/7లో 300 గజాల స్థలం ఉండేది. దాన్ని నిషేధిత భూముల కింద 22ఏ కింద చేర్చారు. మాకు ఎటువంటి న్యాయం జరగడం లేదు.

- పి.రామకృష్ణారెడ్డి, బూరుగుగూడెం, చాట్రాయి మండలం.

రిజిస్ట్రార్ : 22ఏ నిషేధిత భూములు వ్యవహారంపై కలెక్టర్ పరిధిలో ఉంటుంది. నిషేధం ఎత్తివేసే అధికారం మాకు లేదు. జిల్లా కలెక్టర్ వారికి అప్పీలు చేసుకోండి.

- మా అమ్మాయి అమెరికాలో ఉంటుంది. ఇక్కడ ఆస్థులకు సంబంధించి నాకు పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వాలనుకుంటుంది. దీనిని ఎలా రిజిస్టర్ చేసుకోవాలి.

- రామారావు, గుండుగొలను

రిజిస్ట్రార్ : ఇతర దేశాల్లో ఉన్న వ్యక్తులు స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ అని జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ గాని ఇక్కడ ఇండి యాలో ఉండే ఏర్పాటుకు ఆస్తులకు సంబంధించి వ్యవహారాలు చేయడానికి ఇవ్వవచ్చు. ఎంబసీ ద్వారా ధ్రువీకరించి ఇండి యాకు పంపించాలి. దాన్ని మూడు నెలల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో దాఖలు చేసి, వ్యాలిడిటీ చేస్తే అది అమల్లోకి వస్తుంది.

- ఆర్‌వోఆర్ వన్‌బీ మా పేరు రావట్లేదు. మా నాన్న పేరు మీద ఉన్న దానిని నేను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చా.

- రాజు, లింగపాలెం

రిజిస్ట్రార్ : ఎవరి పేరు ఉందో వారి మాత్రమే ఆర్‌వోఆర్ వన్‌బీకి అర్హులు. ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలనుకుంటే రెవెన్యూశాఖకు అర్జీ పెట్టుకుని పరిష్కరించుకోగలరు.

- సామాజిక సేవ చేయడానికి ఒక స్వచ్ఛంద సంస్థను రిజిస్ట్రేషన్ చేసి ప్రారంభించాలను కుంటున్నాను. ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

- సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం

రిజిస్ట్రార్ : మీరు ఆ సంస్థకు సంబంధించిన బైలాను, మెమొరాండం తయారు చేసి సభ్యుల సంతకాలతో మీ సేవలో ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకుంటే అదే రోజున రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు.

- మాకు సంబంధించిన ఉమ్మడి ఆస్తిని నా ప్రమేయం లేకుండా నా కుటుంబ సభ్యులు వేరే వారికి విక్రయించాలని ప్రయత్నిస్తు న్నారు. ఈ రిజిస్ట్రేషన్‌ను ఎలా ఆపాలి.

- రాము, నూజివీడు

రిజిస్ట్రార్ : మీరు సంబంధిత సివిల్ కోర్టును సంప్రదించి ఇంజక్షన్ ఉత్తర్వులు పొందితే, రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయవచ్చు.

- మేము మా ఆస్తికి సంబంధించి దఖలు దస్తావేజులు మా పిల్లల పేరిట రిజిస్టర్ చేయదలిచాం. దీనిపై ఎంత స్టాప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఎంత చెల్లించాల్సి ఉంటుంది?

- కామేశ్వరరావు, ఏలూరు నవాబ్‌పేట

రిజిస్ట్రార్ : స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఎంత కట్టాలనే దానిపై అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పట్టికలో ప్రదర్శించబడి ఉంటాయి. రూ.10లు చెల్లించి వివరాలను, మార్కెట్ వాల్యూ, సహాయ పత్రాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాతపూర్వకంగా పొందవచ్చు.

- ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో అధ్వానంగా ఉంది. గతంలో దీనికి స్థలం మంజూరు చేసినా శాశ్వత భవనం నిర్మించలేదు. కొత్త భవనం నిర్మించాలి.

- నాగమల్లేశ్వరరావు, ముదినేపల్లి

రిజిస్ట్రార్ : ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే భవన నిర్మాణం చేపడతాం.

వైద్యుల నిర్లక్ష్యం.. గర్భిణి మృతి

- పోలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

■ లోపలి పేజీలో..

● ముగిసిన బ్రహ్మోత్సవాలు



ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వైశాఖమాస బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం భక్తులకు కన్నులపండువయ్యాయి. రాత్రి శ్రీవారికి ద్వాదశకోవెల ప్రదక్షిణలు. శ్రీపుష్పయాగోత్సవాన్ని అర్చకులు వేడుకగా జరిపారు. అలాగే చివరి రోజు శయన మహావిష్ణువు అలంకరణలో చినవెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు.



కోమటికుంట చెరువులో గాలింపు చర్యలు

మృత్యు చెరువు

ముగ్గురిని మింగేసిన కోమటికుంట చెరువు

- ఒకరిని రక్షించబోయి మరో ఇద్దరు..
- ప్రాణాలతో బయటపడ్డ మరొకరు
- శుభకార్యానికి వెళ్తుండగా ప్రమాదం
- పెదలింగంపాడు, వేగివాడలో విషాదఛాయలు



అభిలాష్, సాగర్, అజయ్ (ఫైల్ ఫొటోలు)

ఏలూరు క్రైం/పెదవేగి, మే 14 (ఆంధ్రజ్యోతి) : వారంతా బంధువులే. నిత్యం కలిసి మెలిసి పెయిం టింగ్ పనులు చేస్తూ సంతోషంగా తమ కుటుంబా లతో జీవిస్తున్నారు. బంధువుల ఇంట్లో జరిగే ఓణీల ఫంక్షన్‌కు అందరూ కలిసి వెళ్దామనుకున్న ఆ ఐదు గురు యువకులు కలిసి మోటారు సైకిళ్లపై బయలు దేరి వెళుతుండగా మార్గమధ్యలో ఒక చెరువు మృత్యు రూపంలో వారిలో ముగ్గురిని మింగేసింది. మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివ రాలివి.. పెదవేగి మండలం వేగివాడకు చెందిన నేతల అజయ్ (29), నేతల సాగర్ (24), చొక్కా అభిలాష్ (19), నున్నా ప్రవీణ్ (30), నేతల అనంత హర్ష (16) పెయింటింగ్ పనులు చేస్తూ ఉంటారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడులో బంధు వుల ఇంట్లో ఓణీల ఫంక్షన్ బుధవారం జరుగుతుండ డంతో వీరంతా మోటారు సైకిల్‌పై ఫంక్షన్‌కు హాజర య్యే నిమిత్తం బయలుదేరి వెళ్తున్నారు. మార్గమధ్యలో భీమడోలు సమీపంలో కోమటికుంట మంచినీటి చెరువు వద్ద అజయ్ బహిర్భూమికి వెళ్లగా అతనితో పాటు సాగర్ వెళ్లాడు. ఆక్రమంలో అక్కడున్న నాచు కారణంగా తొలుత అజయ్ నీళ్లలోకి జారిపోగా అతని కాపాడే ప్రయత్నంలో సాగర్ నీళ్లలో పడిపోయాడు. వారిని కాపాడడానికి అభిలాష్, ప్రవీణ్ నీటిలో దిగి వారు మునిగిపోయారు. గట్టుపై ఉన్న అనంత హర్ష వచ్చి ఇనుప ఊచను అందించగా ప్రవీణ్ పట్టుకున్నా డు. కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న వారు ప్రవీ ణ్‌ను కాపాడగలిగారు. మిగిలిన ముగ్గురు నీట మునిగిపోయారు. సమాచారం అందుకున్న భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్ఐ వై.సుధాకర్ సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి రిస్క్యూ ఆపరేషన్ నిర్వహిం చారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్కే బాజీ, ఎస్ఐ డ్రైవర్ వంశీ, ఆ ప్రాంతానికి చెందిన జనసేన నాయకుడు మదన్ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు గాలిం పు చేపట్టి ముగ్గురు మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి బుధవారం రాత్రి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్ప గించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషాదంలో బంధువులు

ఈ ప్రమాదంతో అటు పెదలింగంపాడులోని ఇటు పెదవేగి మండలం వేగి వాడలో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. మృతులు ముగ్గురు పేద కుటుంబానికి చెందినవారే. రోజువారీ కూలి పనులతో జీవనం సాగించే ఆ కుటుంబాలు అండగా నిలిచే వ్యక్తులు అందనంత దూరాలకు తరలిపోవడంతో ఆ కుటుంబాలు జీర్ణించుకోలేకపోతున్నాయి.

ఆదుకుంటాం మంత్రి కొలుసు

కాగ ప్రమాద వార్త తెలిసి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుం బాలకు తన సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటా మని వెల్లడించారు.

తమ్ముడి మరణంతో ఒంటరైన అక్క..

- మృతులు ముగ్గురిలో ఒకరైన నేతల సాగర్ తల్లిదండ్రులు సుందరం, సువర్ణలు 15 ఏళ్ల కిందట మృతిచెందారు. అతనికి ఇద్దరు అక్కలు ఉన్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఆ కుటుంబానికి సొంతిల్లూ లేదు. రోజువారీ కూలి పనులతో ఇద్దరు అక్కలను చదివించిన సాగర్.. పెద్ద అక్క స్వరూపకు వివాహం చేశాడు. చిన్న అక్క సుధా రాణి ప్రస్తుతం కళాశాలలో చదువుతోం ది. ప్రస్తుతం ఆ ఇద్దరు చిన్నాన్న ఇంటిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులు లేని తనకు అన్నీ తానే తనను కంటికి రెప్పలా కాపాడుకుం టూ వచ్చాడని, ఇప్పుడు తనకెవ్వరు దిక్కని సుధారాణి బోరున విలపించడం చూపరులను కలచివేసింది.
- నేతల అజయ్‌కు వివాహం కాగా భార్య ప్రీతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పనికెళ్తేనే కడుపునిండే కుటుంబం కావడంతో అతని భార్య, పిల్లల పరిస్థితిని తలచుకుంటూ గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు.
- చొక్కా అభిలాష్ అతని తల్లిదండ్రులు ఇమ్మానియేల్, హిమబిందు. వారికి అభిలాష్ ఒక్కడే కుమారుడు. అభిలాష్‌కు ఒక అక్క ఉంది. కాయకష్టంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న అభిలాష్ తల్లిదండ్రులు అందివచ్చిన కొడుకు దూరమవ్వడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమీప బంధువులు, ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు ఒకేసారి మృత్యువాత పడడంతో గ్రామం లో విషాదఛాయలు అలముకున్నాయి.



సహాయక చర్యల్లో భీమడోలు సీఐ జోసెఫ్ విల్సన్


దంచికొట్టిన వాన



శుభకార్యం..తప్పదుమరి..



మొరాయించింది.. కాస్త చేయి వేయండి..



కొవ్వలిలో కొబ్బరిచెట్టుపై పిడుగు

ఏలూరుసిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో బుధవారం ఉదయం రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం దంచికొట్టింది. ప్రజలు, అటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జనజీవనం స్థంభించింది. ప్రధాన ప్రాంతాల్లో రహదారులపై అడుగు నుంచి రెండు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఏలూరు నగరంలోని ఆర్ఆర్‌పేట నుంచి పవర్‌పేట వెలో బ్రిడ్జిని కూడా మూసివేశారు. ఆ బ్రిడ్జి గుండా వెళ్లే వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఏలూరు ఆర్ఆర్‌పేట, పవర్‌పేట రైల్వేస్టేషన్, ఆర్ఆర్‌పేటలోని కట్టా సుబ్బారావు వీధి, పత్తేబాద రైతుబజారు, ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ, డీసీసీబీ బ్యాంకుకు వెళ్ళే రహదారిలో 2 అడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఆర్ఆర్ పేట, పవర్‌పేట ప్రాంతాల్లో వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం వెలిసిన కొద్ది గంటలకు ఉక్కబోత మొదలైంది.రాబోయే రెండు రోజుల్లో వర్షాలు ప్రారంభమవుతాయని ఇప్పటికే వాతావరణ శాఖ తీపికబురు అందించింది. ఏలూరు జిల్లాలో మొత్తం 156.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 5.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. కుక్కునూరు భీమడోలు, పెదపాడు, పోలవరం మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. దెందులూరు మండలంలోని కొవ్వలి గ్రామ పరిధిలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. అయితే ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పెంటపాడు మండలం అలంపురంలో భారీగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.



ఫైర్‌స్టేషన్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ జామ్





వర్షంలో హాయ్..హాయి



మోకాళ్ల లోతున ఏలూరు శ్రీనివాస్ థియేటర్ రోడ్డు



నే ఉన్నాగా..భయమెందుకు..



మాయదారి వాన.. ఇప్పుడే కురవాలా !



స్వామివారు, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ వడ్లు దంచుతున్న మహిళలు

శాస్త్రోక్తంగా వసంతోత్సవం

ముగిసిన చిన వెంకన్న వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజాధిరాజ వాహనంపై రాజసంగా ఉభయ దేవేరులతో ఆశీనులైన చిన్న తిరుమలేశుడు భక్తజనులపై వసంతాలు కురిపించారు. శ్రీవారి వైశాఖమాస బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి వరకూ జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం పాదుకా మండపం వద్దనున్న పాత కల్యాణమండప ఆవరణలో జరిగిన చూర్ణోత్సవం, వసంతోత్సవం భక్తులకు కన్నులపండువయ్యాయి. ముందుగా కల్యాణ మూర్తులను రాజాధిరాజ వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండప ఆవరణలో ఉంచి హారతులు సమర్పించారు. శ్రీవారు, అమ్మవార్ల ముందు వారి గుణగణాలను కీర్తిస్తూ అర్చకులు, మహిళలు వడ్లు దంచారు. చూర్ణోత్సవ, వసంతోత్సవాలు ఘనంగా జరిపారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీవారికి ద్వాదశకోవెల ప్రదక్షిణలు. శ్రీపుష్పయాగోత్సవం వేడుకగా జరిపారు. శయన మహావిష్ణువు అలంకరణలో చిన వెంకన్న బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిశేషుని పాన్పుగా చేసుకుని పవళించిన శ్రీమహావిష్ణువుకు శ్రీదేవి, భూదేవిలు సేవలు చేస్తూ శయన మహావిష్ణువుగా ఉన్న స్వామిని పలువురు భక్తులు దర్శించి తరించారు.

చినవెంకన్న ఆలయ ఆస్థాన విద్వాంసునిగా సత్యన్నారాయణ



చైర్మన్ సుధాకరరావు నుంచి నియామక పత్రం అందుకుంటున్న సత్యన్నారాయణ

ద్వారకాతిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ఆస్థాన విద్వాంసునిగా ఏలూరుకు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు కేవీ సత్యన్నారాయణను నియమిస్తూ ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు నియామకపత్రం అందించి సత్కరించారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు, పండితుల నుంచి వేదాశీర్వచనం పొందారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజన్నారు. తాను ఎన్నో ఏళ్లుగా స్వామివారిని తన నాట్యం ద్వారా సేవిస్తున్నట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్లపై కీర్తనలు రాసి స్వామివారి సమక్షంలో బ్రహ్మోత్సవాల సమయంలో సైతం నాట్యారాధన చేసినట్టు చెప్పారు. సత్యన్నారాయణను మండలి బుద్ధప్రసాద్, అంబికా రాజా తదితరులు అభినందించారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం



శివనామస్మరణతో మారుమోగిన జక్కరం

కాళ్ళ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఓం నమః శివాయ...హరహర మహాదేవా ! అంటూ జక్కరం గ్రామం బుధవారం శివనామస్మరణతో మారుమోగింది. కాళ్ళ మండలం జక్కరం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ, ప్రముఖులు, గ్రామస్థులు పూనుకుని అత్యంత సుందరంగా దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహాల పునః ప్రతిష్ఠ సందర్భంగా రెండు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వర స్వామి, సూర్యనారాయణమూర్తి, విష్ణుమూర్తి నూతన విగ్రహాలు ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు కన్నుల పండువగా బుధవారం నిర్వహించారు. గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నూతన విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉండి ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యాగశాలలో కలశాలకు పూజలు

“ భార్య, ఇద్దరు కుమార్తెలు నన్ను ఇంటి నుంచి గెంటేశారు. అప్పటి నుంచి వృద్ధాశ్రమంలో ఉంటున్నా. ఇందుకు మిత్రులు కొన్నాళ్లుగా డబ్బులు సర్దుబాటు చేశారు. ఇకపై ఇవ్వలేమని చెప్పారు. డబ్బు కట్టకపోతే ఆశ్రమం నుంచి వెళ్లి పోవాలంటున్నారు. మీరే న్యాయం చేయాలి..” అంటూ పెంటపాడు మండలం ప్రత్తిపాడు శివారు పగులంపాడుకు చెందిన ఒక పెద్దాయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

“నాకు ముగ్గురు కొడుకులు.రెండో కుమారుడు ములపర్రులో ఉంటున్నాడు. అతనికి కొడుకు, కుమార్తె. వారి ఉన్నత చదువులకు మిగిలిన నా ఇద్దరు కుమారుల నుంచి రూ.20 లక్షలు అప్పు ఇప్పించా. ఎకరం పొలం రిజిస్టర్ చేయించా. ఇప్పుడు డబ్బు తిరిగి ఇవ్వమంటే ఇవ్వడం లేదు. నా యోగక్షేమాలు పట్టించు కోవడం లేదు. తప్పించుకు తిరుగుతున్నాడు.న్యాయం చేయాలి’ అంటూ పెనుగొండ మండలం వెలగలవారిపాలెంకు చెందిన ఒకాయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



బంధాలు దూరం

ఈ రెండు సంఘటనలు మాయమవు తున్న కుటుంబ విలువలకు ఉదాహరణలుగా నిలుస్తాయి.. కుటుంబాల మధ్య సమస్యలు రచ్చకెక్కుతున్నాయి.. గతంలో ఇంట్లో సమస్యలు నాలుగు గోడల మధ్యే పరిష్కరించుకునేవారు.. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు మూలం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. అయితే నేటి అధునిక పోకడలతో ఉమ్మడి కుటుంబాలు కాస్త చిన్న కుటుంబాలుగా మారాయి. నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

- కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాలు
- బలపడుతున్న ఆర్థిక సంబంధాలు
- బలహీనమవుతున్న అనుబంధాలు
- నగరీకరణతోనే ఇబ్బందులు
- జీవనోపాధి కోసం ఏకాకులు
- పండుగలప్పుడే అందరూ కలిసేది

నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం



పాలకొల్లు, మే 14 (ఆంధ్రజ్యోతి) : నేడు రెండు కుటుంబాలు కలిసి ఉండటం అటుంచి రెండు మనసులు సైతం కలిసి జీవించలేని పరిస్థితి ఏర్పడింది. యాంత్రిక జీవనంలో డబ్బు సంపాదించే యంత్రాలుగా మారటంతో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆశ్రమాలకు తరలించే పరిస్థితికి వచ్చారు. ఒకప్పుడు పదుల సంఖ్యలో సభ్యులతో కళకళలాడే కుటుంబాలు ఇప్పుడు వెలవెల బోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 10 లక్షలు కుటుంబాలు ఉండగా కేవలం తక్కువ సంఖ్యలోనే ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. పట్టణీకరణ, నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో వలసలు పెరిగి చిన్న కుటుంబాలు ఏర్పడుతున్నాయి. చివరకు గ్రామాలు పల్లెల్లోనూ ఉమ్మడి కుటుంబాలు దాదాపు కనుమరుగయ్యాయి.

ఇరుకు మనసులు..

పెళ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకుంటున్న జంటలు ఇప్పుడు మొబైల్ ఫోన్‌ల పిచ్చితో ఒంటరై పోతున్నారు. తోడు లేకపోవడం, మంచి చెడ్డలు పంచుకునే తోడు లేకపోవడంతో చిన్న సమస్యలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అమ్మానాన్నల ప్రేమను,సోదరీ సోదరుల అనుబంధాన్ని కోరుకునే వారు ఉండరు. అయితే దురదృష్టవశాత్తు అటువంటి బంధాలు ఉన్న కుటుంబాలు ఇప్పుడు కళ్ల ముందు కనిపించడం లేదు. అమ్మా నాన్న, అన్నా చెల్లి, ఒక తమ్ముడు ఇది చిన్న కుటుంబం. వీరికి తోడు తాతయ్య బామ్మలు ఉండేవారు. అప్పుడు ఈ కుటుంబా లన్నీ పెద్దగా ఉండి కుటుంబం వసుధైకంగా ఉండేది. సిరి సంపదల ఉమ్మడి కుటుంబాలు నేడు కనుమరుగవుతున్నాయి. పాశ్చాత్య నాగరికతకు అలవాటు పడుతున్న పౌరులు ఉమ్మడి కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకున్నట్లే వాస్తవ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. కుటుంబ పెద్ద అనే వారే లేకుండా పోయారు.

> కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న విషయాన్ని గుర్తించి ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకత తెలియచేయడానికి ఒక రోజు కావాలని 1989 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించింది. ప్రతీ ఏటా మే 15వ తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం జరుపుకోవాలని 1989 డిసెంబరులోనే నిర్ణయించినప్పటికీ 1993 మే 15 నుంచి అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం జరుపుకుంటున్నారు.

రెండు మూడు దశాబ్ధాలకు ముందు ఒక కుటుంబంలో తాత వారి పిల్లలు.. పిల్లల పిల్లలు, ఇలా మూడు నాలుగు తరాల సభ్యులు ఉమ్మడి కుటుంబంగా అనే గొడుగు కింద ఒదిగి పోయేవారు. ఒకప్పుడు ఇంటికి మూల పురుషుడుగా చెప్పుకునే వ్యక్తులు ఇప్పుడు ఇంట్లో ఒక మూలన పడుకుంటున్నాడు. ఇంటి పెద్ద మాటే వేదవాక్కు. సమష్టి సంపద, సమష్టి భోజనాలతో తల్లిదండ్రులు, అత్తమామలు, అక్కాచెల్లెల్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, తాతలు, బామ్మలు మనవలు ఇలా పదుల సంఖ్య సభ్యులతో ఉమ్మడి కుటుంబాలు కళకళలాడేవి. ఇప్పుడవి లేనే లేవు. ఉమ్మడి కుటుంబాలలో ఉన్న అనుబంధాలు, ప్రేమానురాగాలు ఆత్మీయత, ఆప్యాయత ఇవేమి ఇప్పటి కుటుంబ వ్యవస్థలో కనిపించడం లేదు. ఇరుకు గదులు మధ్య మనసులు కూడా ఇరుకు చేసుకుని జీవించడం తప్ప అనేక కుటుంబాలలో ఆత్మీయత, అనురాగం కనిపించడం లేదు.

విచ్ఛిన్నం అవుతున్న అనుబంధాలు

విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం ప్రారంభం కాగా ఆధునికత పెరగడం నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మీద ప్రభావం చూపించేవి. చివరకు జీవన పోరాటంలో కనీసం భార్యభర్తలు సైతం ఒకేచోట ఉండలేని పరిస్థి ఏర్పడింది. కుటుంబ సభ్యుల మధ్య సామాజిక బేధాలు బలోపేతం చేయడానికి పిల్లల అభివృద్ధికి, సంప్రదాయాలను కాపాడ టానికి ఉమ్మడి కుటుంబాలు దోహద పడతాయి. అంతేకాకుంగా కుటుంబ విలువలను గుర్తిచేయడం, ఐక్యతను ప్రోత్సహించడం ద్వారా కుటుంబాలు బలోపేతం అవుతాయి. ఉమ్మడి కుటంబాలు విచ్ఛిన్న పరిస్థితుల్లో మమ తానుబందాలు తగ్గుతున్నాయి. మానవ సంబంధాల స్థానంలో చివరకు భార్యభర్తల మధ్యకు సైతం ఆర్థిక సంబంధాలే కనిపిస్తున్నాయి. ప్రైమరీ స్థాయి నుంచి పిల్లలకు సామాజిక పరిస్థితులపై అవగాహన మానవ సంబంధాలు తెలియచెప్పే పెద్దలు కుటుంబంలో లేకపోవడంతో మమతానురాగాలకు దూరం అవుతున్నారు.

మానవ సంబంధాలు దూరం

ఆధునిక పోకడలలో చిన్న కుటుంబాలు ఎక్కువ కావడంతో మానవ సంబందాలు పలుచబడుతున్నాయి. బ్రతుకుదెరువు కోసం పిల్లలు పట్టణాలకు నగరాలకు వెళ్లితే పెద్దలు గ్రామాలులోనే ఉంటూ ఆప్యాయ తకు దూరం అవుతున్నారు. యాంత్రిక జీవనంలో కుటుంబంలోని పెద్దలు అనారోగ్యం బారిన పడుతుంటే బాల్యం మానసిక వికాసానికి దూరం అవుతున్నది. ఇప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పది మంది కంటే ఎక్కువ సభ్యులు ఉన్న ఉమ్మడి కుటుంబాలు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. కుటుంబమంటే భార్యభర్త ఇద్దరు పిల్లలు అన్నట్టుగానే ఉంది. చివరకు ఒంటరి మహిళలు, ఒంటరి పురుషులు పేరుతో ఏకైక కుటుంబాలు వెలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థ బలపడితేనే మానవ సమాజం మరింత పురోభివృద్ధి చెందుతున్నదనడంలో అతిశయోక్తి లేదు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పాలిసెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాలలో తూర్పు గోదావరి జిల్లా రాజ మహేంద్రవరంలో గల తిరుమల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నా, పాల రోహన్ 120 మార్కులకు 120 మార్కులు సాధించారన్నారు. 119 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతో పాటు 50 లోపు 14 మంది, 100 లోపు 23 మంది, 500 లోపు 79 మంది విద్యార్థులు సాధించారన్నారు. ర్యాంకుల సాధించిన విద్యార్థులను అక డమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌లు అభినందించారు.



ఎన్‌సీసీ శిబిరానికి విచ్చేసిన కమాండర్, కేడెట్స్

స్వర్ణాంధ్రలో ఎన్‌సీసీ క్యాంపు

ఉభయ గోదావరి జిల్లాల నుంచి 250 మంది కేడెట్స్ హాజరు

పది రోజుల పాటు శిక్షణా శిబిరం

నరసాపురం రూరల్,మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ, నేవీ వల్ల విద్యార్థుల్లో దేశ భక్తి, క్రమశిక్షణ అలవడుతుందని ఏటీసీ 1 క్యాంపు లెఫ్ట్ హెడ్‌కమాండర్ రోహిత్‌కుమార్ అన్నారు. బుధవారం నరసాపురం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఎన్‌సీసీ, ఆర్మీలో చేరేందుకు యువత ఆసక్తి చూపేవారు కాదన్నారు. నేడు ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ఎన్‌సీసీని ఏర్పాటు చేసేందుకు మక్కువ చూపుతున్నాయన్నారు. ఎన్‌సీసీలో సర్టిఫికెట్లు, క్యాంపు సర్టిఫికెట్లు ఉంటే చదువు, ఉద్యోగాల్లో రిజ ర్వేషన్ ఉంటుందన్నారు. పది రోజుల పాటు జరిగే ఈ శిబిరానికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి 250 మంది కేడెట్స్ హాజరయ్యారన్నారు.



మంత్రి లోకేశ్‌తో గన్ని, బూరుగుపల్లి, కె.ఎస్.జవహర్, వలవల బాబ్జీ

లోకేశ్‌ను కలిసిన నేతలు

- ప్రాధాన్యత ఇచ్చినందుకు కృతజ్ఞతలు
- గన్నితో సహా పలువురు నేతల భేటీ

(ఏలూరు, భీమవరం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వివిధ కార్పొరేషన్ల చైర్మన్లగా నియమాకమ్మైన వారంతా బుధవారం యువ నేత, విద్యామంత్రి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన పదవులివ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా మరింత కష్టించి పనిచేస్తామని, ప్రజలకు, ప్రభుత్వం మరింత చేరువయ్యేలా పథకాల అమలే కాకుండా, తమకు అప్పగించిన కార్పొరేషన్ సేవలు ప్రజల చెంతకు తీసుకెళ్తామని లోకేశ్‌కు చెప్పారు. ఆయనను కలిసిన వారిలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో పాటు బూరుగుపల్లి శేషారావు, కె.ఎస్.జవహర్, వలవల బాబ్జి ఉన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సైతం మర్యాద పూర్వకంగా గన్ని, వలవల బాబ్జీలు కలిశారు.



డీఆర్డీఏ, డ్వామా శాఖాధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

సమస్యలుంటే వెంటనే పరిష్కరించండి

పింఛన్ల పంపిణీపై డీఆర్‌డీఏ, డ్వామా శాఖాధికారులతో జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్ష

ఏలూరుసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): పింఛన్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్ష నిర్వహించారు. ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ కె.వెంకటసుబ్బారావులు పాల్గొన్నారు. పింఛన్ ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆమె సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్షిస్తూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రామికుల పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని, శ్రామికులకు తాగునీరు, నీడ వైద్య సౌకర్యాలు వంటి ప్రాథమిక అవసరాలు తప్పకుండా ఉండేలా చూడాలని అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఆదేశించారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్న నేపథ్యంలో వారికి నీడను కల్పిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వేసవి జాగ్రత్తలు సూచించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



పోలీసులు, బ్యాంకు అధికారులను అభినందిస్తున్న ఎస్పీ నయీం అస్మి

సైబర్ నేరాన్ని ఛేదించిన పోలీసులు: ఇద్దరి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన వ్యక్తిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ పద్ధతిన రూ.50 లక్షలు నగదును చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించడంపై ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బుధవారం అభినందించారు. స్థానిక కొబ్బరితోటకు చెందిన పోపూరి సాంబశివ ప్రసాద్ అక్రమ రవాణా కేసులో ముద్దాయిగా ఉన్నాడని భయపెట్టి అతన్ని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ చేసినట్టు చెప్పారు. అతని నుంచి రూ.50లక్షల నగదు రెండు బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్‌టీజీఎస్ మార్గంలో బదిలి చేయించుకున్నారు. దీంతో బాధితుడు తాడేపల్లిగూడెం పోలీసులను ఆశ్రయించగా పోలీసు బృందం రాజస్థాన్‌లో మూలాలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే ఆ రాష్ట్రంలోని హనుమాన్ రామ్, దినేష్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బాధితుడు పోగొట్టుకున్న సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరగాళ్లను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను, సమర్థవంతంగా పనిచేసిన బ్యాంకు అధికారులను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

పెళ్లికెళ్తే ఇల్లు దోచేశారు..

27.75 కాసుల బంగారం, 4 కేజీల వెండి, 8.60 లక్షల నగదు చోరీ

పోలవరం, మే 14(ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళాలు వేసి బంధువుల పెళ్లికెళ్తే ఇల్లు లూటీ చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం పోలవరం పంచాయతీ జగన్నాథపేట గ్రామంలో జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం గ్రామానికి చెందిన నంబూరి శ్రీను కుటుంబ సమేతంగా రాజమహేంద్రవరం పెళ్ళికి వెళ్ళి రాత్రి 8 గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండడం, బీరువా తలుపులు తెరిచి ఉండడంతో చోరి జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందిచారు. దీంతో పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్ నేర ప్రాంతానికి చేరుకుని పరిసరాలు పరిశీలించారు. బీరువాలో ఉన్న 27.75 కాసుల బంగారం, 4 కేజీల వెండి, 8.60లక్షల నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని గొల్లాయిగూడానికి చెందిన కారె కనకాంబరం (72) మూడు చక్రాల తోపుడు బండిపై తిరుగుతూ ఉంటాడు. ఏ కారణమో తెలియదు కాని బుధవారం సాయంత్రం ఏలూరు సమీపంలోని దుగ్గిరాల సెంటర్‌కు మూడు చక్రాల బండిపై వెళ్ళి అక్కడ పురుగుమందు తాగేశాడు. అతని పరిస్థితి గమనించిన దారివెంబడి వెళ్ళే వారు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఘనంగా రఘురామ పుట్టిన రోజు వేడుకలు

- ఏపీ డిప్యూటీ స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు భారీగా తరలివచ్చిన నాయకులు

కాళ్ళ, మే 14(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కాళ్ళ మండలం పెద అమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో కార్యకర్తలు, అభిమానులు, స్నేహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. భీమవరానికి అతి సమీపంలో పెద అమిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు దివంగత ఎన్‌టీఆర్ పేరు మీద 'ఎన్‌టీఆర్ కళాప్రాంగణం' పేరుతో ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ఇప్పటికే దాని డిజైన్ కూడా పూర్తయ్యిందని, జూన్ మొదటి వారంలో శంకుస్థాపన చేస్తామన్నారు. అదేవిధంగా ఆకివీడులో కూడా ఆసుపత్రి పక్కన కెనరా బ్యాంక్ సౌజన్యంతో సుమారు రూ. 50 లక్షలతో ఒక ఓపెన్ ఎయిర్ థియేటర్ కం వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య లేకుండా చూస్తానన్నారు. తన పుట్టినరోజు వేడుకకు పూలబొకేలు కాకుండా పుస్తకాలివ్వాలని ఆఖరి నిముషంలో పిలుపునిచ్చినా వేలాది పుస్తకాలు అందించారన్నారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ మంత్రి పీతల సుజాత, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, రైల్వే బోర్డు సభ్యుడు కోరా రామమూర్తి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, పలువురు పోలీసు అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలు బహూకరించిన కత్తిని ప్రదర్శిస్తున్న రఘురామకృష్ణరాజు

మీ సహకారానికి అభినందనలు!

- నేడు ఎమ్మెల్యేలు, ఎంఈవోలు, ఎస్ఎంసీల వద్దకు హెచ్ఎంలు, టీచర్లు
- పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై విద్యాశాఖ మౌఖిక ఆదేశాలు
- టీచర్ల బదిలీల మార్గదర్శకాలకు తుదిరూపు!

ఏలూరు అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ అమలులో బుధవారం పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. పంచాయతీ యూనిట్‌గా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వచ్చే జూన్ నుంచి ప్రారంభంకానున్న 9 రకాల బడుల రూపకల్పన, కార్యాచరణకు సహకరించిన వారందరికీ 'అభినందనలు' చెప్పాల్సిందిగా పాఠశాల విద్య ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులను తన కార్యాలయానికి ఆహ్వానించిన డీఈవో వెంకటలక్ష్మమ్మ 'కంగ్రాట్స్' చెప్పేశారు. కలెక్టర్‌కు డీఈవో కంగ్రాట్స్ చెప్పాలని సూచించారు. తదుపరి గురువారం ఒక్కరోజులోనే జిల్లాలోని అన్ని పాఠశాలల ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)ల చైర్మన్, వైస్ చైర్మన్లను సంబంధిత స్కూళ్ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులంతా కలిసివెళ్లి అభినందనలు చెప్పాలని, అదేసమయంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలుసుకుని పుష్పగుచ్ఛాలతో కృతజ్ఞతలు తెలియజేయాలని అన్ని మండలాల ఎంఈవోలను ఆదేశించారు. గత మూడు నెలలుగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు సహకరించినందుకు వారికి అభినందనలు తెలియజేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 రకాల బడుల కింద మొత్తం 2921 పాఠశాలలు ప్రారంభమవుతున్న విషయం విదితమే.

నేడు బదిలీల షెడ్యూల్ విడుదల!

కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టం ప్రకారం తొలిసారిగా చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి షెడ్యూలు గురువారం విడుదల కానున్నట్టు సంకేతాలు వచ్చాయి. దీనికి సంబంధించి బదిలీలు కోరుకునే టీచర్లు ఆన్‌లైన్‌లో సమర్పించాల్సిన ధ్రువీకరణపత్రాలు, దరఖాస్తు విధానంపై బుధవారం డెమో ఇచ్చారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రకారం వెకెన్సీలను నిర్ధారించిన అధికారులు బదిలీల ప్రకటన వెలువడే వరకు వివరాలను బహిర్గతం చేయలేమని స్పష్టం చేశారు.

అన్ని వేకెన్సీలు భర్తీ అయ్యాకే ఎంపీఎస్ హెచ్ఎం పోస్టులు!

9 రకాల పాఠశాలలతో ఈ దఫా ప్రాథమిక పాఠశాల్లో విధులు నిర్వర్తించే ఎస్జీటీల వేకెన్సీలు పూర్తిస్థాయిలో భర్తీకానుండగా, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ వెకెన్సీలు భారీగానే మిగులు(సర్‌ప్లస్) ఖాతాలో ఉంటాయని తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్కూల్ అసిస్టెంట్లను కొత్తగా ఏర్పాటవుతున్న మోడల్ ప్రైమరీ స్కూళ్ల(ఎంపీఎస్)కు ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తామని విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు 230 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎంపీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీకోసం కన్వర్షన్ చేశారు. తాజా బదిలీల్లో ఈ హెచ్ఎం పోస్టుల భర్తీపై స్పష్టతనిచ్చారు. ఆ ప్రకారం బదిలీలు కోరుకునే స్కూల్ అసిస్టెంట్లంతా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా సబ్జెక్టుల్లో అందుబాటులో ఉంచిన బదిలీ వేకెన్సీలకు ఆప్షన్లు ఇవ్వాలి. ముందుగా క్లియర్ వేకెన్సీలన్నీ ఆయా సబ్జెక్టుల నుంచి భర్తీ అయ్యాకే, మిగిలిన స్కూల్ అసిస్టెంట్లకు ఎంపీఎస్ హెచ్ఎం పోస్టుల వేకెన్సీల కేటాయింపు జరిగేలా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు సమాచారం. బదిలీల మార్గదర్శకాల్లో దీనిపై అధికారిక వివరణ వస్తుందని భావిస్తున్నారు.

పాలిసెట్‌లో బాలికలదే హవా

పశ్చిమలో 95 శాతం, ఏలూరు జిల్లాలో 96.36 శాతం ఉత్తీర్ణత

భీమవరం రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష అయిన పాలిసెట్ పరీక్షా ఫలితాల్లో బాలికలదే పై చేయి అయింది. బుధవారం సాయంత్రం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో బాలికలు 96 శాతం, బాలురు 94 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పాలిసెట్ పరీక్షకు 6,489 మంది విద్యార్థులు హాజరు కాగా 6169 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వారీగా 95శాతం ఉత్తీర్ణతగా నిలిచారు. వీరిలో బా లురు 3865మందికి గాను 3634 మంది ఉత్తీర్ణత సాధిం చగా బాలికలు 2624 మందికి గాను 2535 మంది ఉత్తీర్ణత సాధించారు. గత నెల 30 న పాలిసెట్ పరీక్ష నిర్వ హించారు. 13 రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడం విశేషం..

ఉత్తీర్ణత పెరగడంతో సీట్ల భర్తీపై ఆశలు

ఈ ఏడాది పాలిసెట్‌లో ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాలిటెక్నిక్ కళాశాలల యాజమాన్యాల్లో ఆశలు పెరిగాయి. సీట్ల భర్తీ పెరుగుతుందని అంచనాలు వేసుకుంటున్నారు. జిల్లాలో ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, 8 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 3600 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ పాలిసెట్‌లో 6169 మంది ఉత్తీర్ణత సాధించడంతో సీట్ల భర్తీ పెరిగే అవకాశం కూడా ఉంది. గత ఏడాది 1460 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 45 శాతం సీట్ల భర్తీతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పాలిసెట్ రాసేందుకు ఆసక్తి చూపిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. దీనిని బట్టి పాలిటెక్నిక్‌లో చేరే వారి సంఖ్య ఎక్కువ ఉంటుందని యాజమాన్యాల అభిప్రాయం.

ఏలూరు జిల్లాలో 96.36 శాతం ఉత్తీర్ణత

ఏలూరు అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి) : పాలిసెట్-2025 ఫలితాల్లో ఏలూరు జిల్లా నుంచి 96.36 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 3713మంది హాజరుకాగా, వీరిలో 3615మంది (96.36శాతం) ఉత్తీర్ణులయ్యారు. పాసైన వారిలో 2,297మంది బాలురు, 1318 మంది బాలికలున్నారు. జిల్లాకు చెందిన కొండాబత్తుల కౌశిక్ 118 మార్కులతో జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకు(రాష్ట్రంలో 109 ర్యాంకు), పారేపల్లి అక్షయ్ 118 మార్కులతో జిల్లా ద్వితీయ ర్యాంకు(రాష్ట్రంలో 137),మెట్టా నాగదివ్య 115 మార్కులతో జిల్లా తృతీయ ర్యాంకు(రాష్ట్రంలో 459) సాధించి టాపర్లుగా నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆయా కోర్సుల్లో మొత్తం 82,870 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కోలమూరు పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి రూ.5 వేలు

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సుభాష్ రాజు

ఉండి, మే 14(ఆంధ్రజ్యోతి): తమ ఊరి పాఠశాలలో కొత్తగా చేరిన ప్రతి విద్యార్థికి రూ.5 వేలు అందిస్తానని బీజేపీ జిల్లా కన్వీనర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల సుభాష్‌రాజు ప్రకటించారు. కోలమూరు పాఠశాలలో విద్యార్థులు,తల్లిదండ్రులతో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గతంలో ఇక్కడ పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు ఉండేవారన్నారు. క్రమేపీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు.తాను హెచ్‌ఎంతో కలిసి గ్రామంలో ఇంటింటా తిరిగి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సుమారు 50 మందికి పెంచామన్నారు. విద్యార్థుల నమోదును మరింత పెంచడానికి కొత్త చేరిన ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనంతో పాటు తాను రూ.5 వేలు అందిస్తానని సుభాష్ రాజు తెలిపారు.

చెక్కు బౌన్స్ కేసులో ఉద్యోగికి ఏడాది జైలు

ఏలూరు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి) : చెక్కు బౌన్స్ కేసులో ఓ ఉద్యోగికి ఏడాది జైలు శిక్ష రూ.4 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏలూరుకు చెందిన ఎన్ రమేశ్ బాబు దగ్గర కుటుంబ అవసరాల నిమిత్తం ఏలూరులోని దేవదాయ శాఖ కార్యాలయ ఉద్యోగి తిరుమల పెద్దింటి మాధవి 2019లో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చే నిమిత్తం 2020లో రూ.2 లక్షల చెక్కును రమేశ్ బాబుకు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంకులో జమ చేయగా చెల్లుబాటు కాలేదు. దీంతో బాధితుడు రమేశ్ బాబు కోర్టులో మాధవిపై కేసు వేశారు. కేసు తుది విచారణను ఏలూరు జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబూ తాలీబ్ పర్వేజ్ విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో మాధవికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ బాధితుడైన రమేశ్ బాబుకు రూ.4 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించాలని తీర్పునిచ్చారు.రమేశ్ బాబు పక్షాన న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు తన వాదనలు వినిపించారు.

వైద్యుల నిర్లక్ష్యం.. గర్భిణి మృతి



మృతి చెందిన గర్భిణి శిరీష

పోలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

పోలవరం, మే 14(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా నిండు గర్భిణీ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. పోలవరం మండలం జిల్లెల్లగూడెం పంచాయతీ కొత్త కుంకాల గ్రామానికి చెందిన తామా శిరీష(25) అనే గిరిజన మహిళ 9 నెలల నిండు గర్భిణీ. పురిటి నొప్పులతో మంగళవారం రాత్రి 10 గంటలకు పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో జాయిన్ అయ్యింది. గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడం వలన సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఉదయం 7 గంటలకు ఆమె పరిస్థితి విషమించడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తరలిస్తుండగా ఆస్పత్రి గేటు వద్దకు వచ్చేసరికి మృతి చెందింది. 10 గంటల వ్యవధిలో తగు వైద్య సేవలందించకపోవడం, మెరుగైన వైద్య చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి సిఫార్సు చేయకపోవడం వలన వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తన భార్య చనిపోయిందని మృతురాలి భర్త భూచంద్రం, బంధువులు ఆరోపించారు. మృతురాలికి రెండేళ్ళ వయస్సు ఉన్న పాప ఉన్నది. ఈ విషయంపై గైనకాలజిస్ట్ విష్ణువర్ధినిని వివరణ కోరగా ఫోన్‌లో నర్సులకు సూచనలు ఇవ్వడం జరిగిందని, రెండేళ్ల క్రితం మృతురాలికి జరిగిన సిజేరియన్ ఆపరేషన్ కుట్లు మానకపోవడం మళ్ళీ వెంటనే గర్భవతి కావడం వలన గర్భసంచికి వేసిన కుట్లు విడిపోయి అంతర్గత రక్తస్రావం జరిగిందని తెలిపారు. రక్తహీనత వలన చనిపోవడం జరిగిందని వివరించారు. గిరిజన గర్భిణి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో రాములునాయక్ పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యాధికారులను విచారించారు. వైద్యాధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్‌కి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి పద్మావతి నేతృత్వంలో నలుగురు కమిటీ సభ్యుల బృందం ఆసుపత్రికి చేరుకుని వైద్యులను, సిబ్బందిని మృతురాలి బంధువులను విచారించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ సతీష్ మాట్లాడుతూ గిరిజన గర్భిణీ మృతి డ్యూటీ డాక్టర్, ప్రసూతి వైద్య నిపుణులు సకాలంలో స్పందించకపోవడం వల్లనే జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించడం జరిగిందని వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

హైవోల్టేజీతో కాలిన విద్యుత్ పరికరాలు



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వస్తున్న దృశ్యం

ఆకివీడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : హై వోల్టేజీతో పలు గృహాల్లో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. స్థానిక మోటుపల్లి వీధిలో మంగళవారం అర్ధరాత్రి హై వోల్టేజీ రావడంతో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అంతే కాకుండా సుమారు 20 గృహాల్లో ఏసీలు, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. ఏఈ రత్నాకర్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని పలుమార్లు స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని, అయినా అధికారులు మార్చకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఏలూరు క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ భరించలేక ఒక ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడి గ్రామానికి చెందిన నంబూరి అశోక్ (35)కు భార్య ఉషారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ అవసరాలు నిమిత్తం అప్పులు చేశాడు. వాటిని చెల్లించమని అప్పులు ఇచ్చిన వారు ఇంటి చుట్టూ తిరిగి వేధించడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది బుధవారం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో ఎస్ఐ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

అదుపుతప్పి లోయలో పడిన కారు

నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

కొయ్యలగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లోయలోపడిన కారు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం ఉదయం పొగాకుబోర్డు సమీపంలో జాతీయ రహదారి పై చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబసభ్యులైన పగడాల రామ్‌గోపాల్‌కృష్ణ, కృష్ణకుమారి, నాగేశ్వరమ్మ, దుర్గలకు తీవ్రగాయాలయ్యాయి. వీరి నలుగురిది తిరువూరి దగ్గర గంపలగూడెం గ్రామం. ఈ నలుగురు గంపలగూడెం నుంచి రాజమండ్రిలో ఒక వివాహ వేడుకకు వెళ్తున్నారు. మార్గమధ్యలో కొయ్యలగూడెం పట్టణం దాటాకా పొగాకుబోర్డు సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి లోయలోకి వెళ్లింది. నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఉన్నతవైద్యం కోసం గుంటూరు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

టీ.నర్సాపురం, మే14 (ఆంధ్రజ్యోతి): వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన వ్యక్తి వేధిస్తుండటంతో గ్రామపెద్దలకు ఫిర్యాదు చేయగా పెద్దలు మందలించినప్పటికి ఫలితం లేకపోయింది. దీనితో మహిళ కుటుంబాన్ని మండలంలోని మరో గ్రామానికి కాపురం మార్చారు. మంగళవారం భర్తలేని సమయంలో ఆ వ్యక్తి మహిళ ఇంటికి వెళ్లి ఆమెను వేధించి తన మాట వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆ మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన కానిస్టేబుల్

పెదపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఏపూరు గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు కంట్రోల్‌రూంకు సమాచారం అందడంతో వెంటనే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ పి.వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను కాపాడారు. ఆమె ఏపూరు గ్రామానికి చెందిన ఆర్.నాగేశ్వరమ్మగా గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇంటిలో గొడవలు కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి రైల్వే ట్రాక్‌పైకి వెళ్ళగా పోలీసులు వెళ్లి కాపాడారు. సకాలంలో స్పందించి ప్రాణనష్టం నుంచి కాపాడిన పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తేలని శ్రీనిధి గోల్‌మాల్ వ్యవహారం

పూర్తి స్థాయిలో విచారణకు కదలని అధికారులు

బాధితుల లబోదిబో

గణపవరం, మే14 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం ముగ్గళ్ల గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన శ్రీనిధి నిధులు రూ.36లక్షలు గోల్‌మాల్‌పై నెల రోజులు దాటుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలుత బాధితులు తమ సొమ్ము అపహరించారని చేసిన ఆరోపణలపై చేపట్టిన ప్రాథమిక విచారణలో వీఓఏ వెంకటలక్ష్మి రూ.16లక్షలు వాడుకున్నట్లు తేలిందని గణప వరం ఏపీఎం ఎస్ఎస్.అమీఉన్నీసా తెలిపారు. దీనిపై గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఏప్రిల్ 15వ తేదీ చెల్లిస్తామని హామీ ఇచ్చిన వెంకటలక్ష్మి అప్పటి నుంచి నేటి వరకు ఇంకా పరారీలోనే ఉన్నారు. అయిత ఈ సంఘటనపై బాధితులంతా ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు మొరపెట్టుకున్నారు. ఆయన జిల్లా ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి 20రోజులు దాటుతున్న కనీసం విచారణకు కూడా జిల్లా అధికారులు రాలేదని తమకు న్యాయం జరగలేదని బాధితులు గగ్గొలుపెడుతున్నారు. ఇది ఇలా ఉండగా వెలగపల్లి గ్రామంలో 14లక్షల 50వేలు సొమ్ము గోల్‌మాల్‌పై కూడా ఎటువంటి పరిష్కారం లభించలేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన శ్రీనిధి జిల్లా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

లాడ్జిపై దాడి.. నలుగురి అరెస్టు

భీమవరం క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ఒక లాడ్జిలో వ్యభిచారం నిర్వహి స్తున్న ముగ్గురు వ్యక్తులను, ఒక మహిళను మంగళవారం రాత్రి వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు అరెస్ట్ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని లాడ్జిలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్‌ఆర్‌కే లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందని గుర్తించారు. దీంతో రాజమహేంద్రవరానికి చెందిన కొండేటి సాయిరాం, భీమవరం చినరంగనిపాలెంకు చెందిన గాడి సత్యనారాయణ, గణపవరానికి చెందిన ముంగర సురేష్‌లతోపాటుగా ఒక మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాధిత మహిళను హోంకు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు మంత్రిచే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జ్యూట్ మిల్ సమీపంలోని మినీ బైపాస్ రోడ్డు సీసీ క్లబ్ ఎదురుగా కృష్ణ కాలువపై పంపులు చెరువు రోడ్ కలుపుతూ నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి గురువారం మంత్రి కొలుసు పార్థసారధి, శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు ఎంపీ పుట్ట మహేశ్ కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకానున్నారు.

సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం, మే 14(ఆంధ్రజ్యోతి) : ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామకృష్ణ అన్నారు. బుధవారం యూటీఎఫ్ భవనంలో సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జిల్లా కమిటీ సభ్యుడు జి.వెంకట్రావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా కార్యకర్తలకు ప్రస్తుత రాజకీయ అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, అందుగుల ప్రభాకరరావు, జోడే సూర్య చంద్రరావు, గంగా భవానీ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ఏలూరు టూ టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరుకు చెందిన బాలిక (16)ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఏలూరు టూటౌన్ పరిధిలోని కబడ్డీ కాలనీకి చెందిన కర్నాడ రాజు(23) తాపీ పనులు చేస్తూ ఉంటాడు. ఆ బాలికకు రాజుతో కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. ఈ విషయం ఆమె తల్లికి తెలియడంతో రాజు గురించి ఆరా తీయగా ఇటీవల పెళ్లి అయ్యి భార్యకు విడాకులిచ్చాడని, రాజు మంచి వ్యక్తి కాదని చెప్పింది. ఈ నేపథ్యంలో 13వ తేదీన బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి తప్పించుకుని వచ్చిన బాలిక జరిగిన విషయం తల్లికి చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణీ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, మే 14(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీ మృతికి కారకులైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామినిలు బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వైద్యులు ఆసుపత్రులలో నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కామవరపుకోట, మే 14(ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల సెంటర్‌లో 25 అడుగులతో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబు ఆధ్వర్యంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, పెనుమర్తి రామ్‌కుమార్, సాయల సత్యనారాయణ, టీడీపీ బీసీ సెల్ ఏలూరు జిల్లా నాయకులు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు, వేముల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు దుర్గారావు, డోలా విజయ్, వేముల హనుమంతు, దాసరి చంద్రశేఖర్ తరలివచ్చారు.

జోరు వర్షంలోనూ సడలని సీహెచ్‌వోల పోరు

ఏలూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌వోలు)న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ నిర్వహిస్తున్న ఆందోళన బుధవారం 17వ రోజుకు చేరింది. ఉదయం కురిసిన భారీ వర్షంలోనూ ఆందోళనలో కొనసాగించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారులు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో నాయకులు మాట్లాడుతూ సీహెచ్‌వోలుగా ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన పెంపుదలను అమలు చేయాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్‌చార్టు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఒకరిపై దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఒకరిపై యువకుడు దాడి చేయడంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యాడు. ఏలూరు తూర్పు వీధికి చెందిన పిల్లి శివశంకర్(48) టైలర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 13వ తేదీ రాత్రి మద్యం కొనుగోలు చేయడానికి చాటపర్రులోని వైన్‌షాపునకు వెళ్లాడు. అప్పటికే అక్కడ తూర్పువీధికి చెందిన కొండగుంటూరు లక్ష్మణ్ (24) మద్యం తాగి మత్తులో ఉన్నాడు. శివశంకర్‌కు అడ్డుగా ఉండడంతో తప్పుకోమని అనడంతో ఆగ్రహించిన లక్ష్మణ్ శివశంకర్‌పై దాడి చేశాడు. తీవ్ర గాయాలకు గురైన శివశంకర్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలిపారు. దీనిపై ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనాబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుగూడెంలో విగ్రహ ప్రతిష్ఠ

టి.నర్సాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): తిరుమలదేవిపేట గ్రామ పంచాయతీలోని పెరుగుగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రమూర్తి పరివార దేవత, శ్రీముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి స్వామికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, శ్రీమహాగణపతి, హనుమాన్ లక్ష్మణసమేత వార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కళాశాలలో మాట్లాడుతున్న ఘంటా మురళీ

వెంకటేశ్వర కళాశాలలో అడ్మిషన్లు ఇవ్వరా?

▸▸ లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానన్న మాజీ ఎమ్మెల్యే ఘంటా

ఏలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల 2025-26 సంవత్సరం అడ్మిషన్ల విషయంలో కలెక్టర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతీ ఒక్కరిని తప్పుదోవ పట్టించేలా కళాశాల మేనేజ్‌మెంట్ వైఖరి ఉందని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ ఆరోపించారు. ఆయన బుధవారం కళాశాలకు వెళ్లి అక్కడ సిబ్బందిని ఈ విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓ వైపు ఇదే ద్వారకాతిరుమల దేవస్థానానికి చెందిన భీమడోలు కాలేజ్‌లో చేరేందుకు వస్తోన్న వారికి అడ్మిషన్లు తీసుకుంటూ, ఈ కాలేజీలో ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ఒకవేళ కాలేజ్‌లో అడ్మిషన్లు ఇవ్వని పక్షంలో ఇదే విషయంలో బోర్డు పెట్టాలి కదా అని ప్రశ్నించారు. 41 సంవత్సరాల క్రితం ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ మెట్ట ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం ఈ కాలేజీకి అనుమతినిచ్చిందని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనే కాలేజీ మూయడానికి వీల్లేదని యాజమాన్యానికి తెలిపారు. కాలేజ్ అడ్మిషన్ల విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని మురళీ చెప్పారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే చంటి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సుస్థిర పాలనకు నాంది పలికిందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతులను క్యాంప్ కార్యాలయంలో స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యమన్నారు. దీంతో పాటు అనేక ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటూ వాటన్నింటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

తహసీల్దార్ కార్యాలయం శిథిలం

117 ఏళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో నిర్మాణం



శిథిలావస్థలో ఉన్న పోలవరం తహసీల్దార్ కార్యాలయం

పోలవరం, మే 14(ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. 117 సంవత్సరాల క్రితం బ్రిటీష్ హయాంలో నిర్మించిన కార్యాలయం అవడంతో పైకప్పు పెంకులు ఊడి వర్షాలకు నిలబడలేని స్థితిలో ఉంది. ఎలాంటి మరమ్మతులు చేయించకపోవడంతో వర్షపునీరు లోనికి జారి కార్యాలయంలో ముఖ్యమైన దస్త్రాలు, అడంగళ్లు, విలువైన భూముల వివరాలు ఉన్న ఫైళ్లు తడిచి పాడయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. గత నాలుగేళ్ల క్రితం బరకాలు కప్పించి తాత్కాలికంగా పరిష్కారం చూపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కార్యాలయానికి మరమ్మతులు లేకపోవడంతో బరకాలు సైతం చిరిగిపోయే స్థితికి చేరుకున్నాయి. ఈ రెండు కార్యాలయాల్లో సుమారు 30 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పైకప్పు పెంకులు ఎక్కడికక్కడ పడిపోయే స్థితిలో ఉండడంతో విధులు నిర్వహించే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ పనులు చేసుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే కార్యాలయ భవనాన్ని అధికారులు వరదల సమయాల్లో వరద సహాయక కంట్రోలు రూంగా అధికారులు వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి కార్యాలయం పైకప్పుకు మరమ్మతులు చేయించాలని సిబ్బంది కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్/ బుట్టాయగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు సెంటర్లలో ప్రచారజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, బండి వెంకటేశ్వరరావు, ఎ.అప్పలరాజు, పళ్ళెం కిశోర్‌లు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్పొరేట్ శక్తులకు మేలు చేసే చర్యలు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోలా వెంకట భాస్కరరావు, డి.వెంకటేశ్వరరావు, బి.నారాయణరావు, నారా శ్రీను, డి.అప్పారావు, సింహాచలం, వెంకట్రామయ్య పాల్గొన్నారు. సమ్మెను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ నాయకుడు కారం రాఘవ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం పి.ఆర్. భవనం వద్ద సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ మోదీ తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను విరమించుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తగరం బాబూరావు, ఇ.భూషణం, బి.వినోద్, బాషా, శ్యాంబాబు, జి.రమేశ్, ధర్మల వెంకట్, మర్రి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

జంగారెడ్డిగూడెం/ చింతలపూడి, మే 14(ఆంధ్రజ్యోతి) : సారా తయారీ, అమ్మకాలను విడనాడిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించడం కోసం కృషి చేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ జిల్లా ఎస్పీ సి.హెచ్. అజయ్ కుమార్ సింగ్, చింతలపూడి సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ సి.హెచ్. అజయ్ కుమార్ సింగ్, సీఐ అశోక్‌లు మాట్లాడుతూ సారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. సారా తయారీని అడ్డుకునేందుకు సంబంధిత వ్యక్తులకు అర్హతను బట్టి ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా ఎక్సైజ్ సంకల్పం పేరుతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాండురంగారావు, ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొని మాట్లాడారు. జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యక్రమంలో ఎంపీడీవో, డీఆర్డీఏ అధికారులు, ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు పాల్గొన్నారు.

చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డీఎస్సీ మోడల్ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

పెదపాడు, మే 14(ఆంధ్రజ్యోతి) : చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీఎస్సీ మోడల్ పరీక్ష పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించిన నేపథ్యంలో డీఎస్సీ అభ్యర్థుల కోసం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సారథ్యంలో చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట 100 రోజుల ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను పూర్తి చేశారు. వారందరికీ డీఎస్సీ పరీక్ష మీద అవగాహన కల్పించేందుకు డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 250 అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లుగా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. పరీక్ష అనంతరం వీరందరికీ కళాశాల ఆవరణలో భోజనాలను అందజేశారు.

ఏలూరులో కంపెక్టర్ ప్రారంభం



కంపెక్టర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.46 లక్షలతో నూతనంగా కొనుగులో చేసిన మీడియం సైజ్ కంపెక్టర్‌ను బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ షేక్ నూర్జహాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం పనుల నిమిత్తం సర్కిల్స్ వారీగా అవసరమైన పనిముట్లను గుర్తించి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. నగర సంస్థ పరిధిలో ఉన్న 50 డివిజన్లలో 16 సర్కిల్స్‌లో ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్‌కి తరలించడానికి 17 ట్రాక్టర్లు, 8 కంపెక్టర్లు ఉపయోగిస్తున్నామన్నారు. డోర్ కలెక్షన్‌కు సంబంధించి సరిపడా సిబ్బంది వారికి సరిపడా పుష్ కార్ట్స్, బీన్స్, డంపర్ బాక్సులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎంఈ సురేంద్రబాబు, డీఈ రజాక్, ఏఈ సాయి,సూపరింటెండెంట్ సిరాజుద్దీన్, డిప్యూటీ మేయర్ వందల దుర్గాభవాని పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఏలూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు బుధవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గ్రంథాలయ సిబ్బంది బీవీఎస్ లక్ష్మీ విద్యార్థుల చేత నీతికథలు పుస్తకాలు చదివించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ ఎం.ఆషా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ క్రమ శిక్షణతో ఎలా మెలగాలి, జ్ఞాపక శక్తి మెరుగుపరిచేలా ఆటలు ఆడించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా క్లాసులు, క్విజ్ పోటీలు, వార్తా పత్రికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి సందీప్ కుమార్, ఎం.డి.అస్లాంపాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదపాడు : స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఉచిత శిక్షణను అందజేస్తున్నట్టు గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా కవితలు, కథనాలు గురించి వివరించారు. అనంతరం బాలబాలికలకు ఖోఖో ఆటను నేర్పించి వారిచే ఆడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి స్ట్రెచర్ అందజేత



స్ట్రెచర్‌ను బహూకరించిన దాత

ఏలూరు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆశ్రం ఆసుపత్రి టెక్నీషియన్ మెండా గాంధీ విజ్ఞప్తి మేరకు రిటైర్డ్ హెడ్ మాస్టార్ ఏలూరు శాంతి నగర్‌కు చెందిన వి.వర ప్రసాద్ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి స్ట్రెచర్‌ను బహూకరించారు. ఆసుపత్రి ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సి.హెచ్.సుధాకర్, సైక్రియార్టిస్ట్ హెచ్‌వోడీ వంశీ, డాక్టర్ ఎల్ సురేష్, అసిస్టెంట్ నేతల ఆనందబాబులు పాల్గొన్నారు.



రోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆసుపత్రి సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలి

బుట్టాయగూడెం, మే 14(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, అన్ని వేళలా వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని, ఆసుపత్రిపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి

జీలుగుమిల్లి, మే 14(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో నిఖిల్ మధు శరణ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ, ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.మండలంలో ఐదేళ్లలోపు సుమారు 176మంది చిన్నారులను ఆధార్ నమోదు చేయించనివారు ఉన్నారన్నారు.వీరందరికీ ఆధార్ నమోదు చేయించేలా ఆయా శాఖల అధికారులు సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీమహదేవమ్మ, సచివాలయ ఏఎన్ఎంలు, మహిళా పోలీస్‌లు, అంగన్వాడీ కార్యకర్తలున్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

కొయ్యలగూడెం, మే14(ఆంధ్రజ్యోతి): సారా కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. మండలంలోని శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



పీతల సుజాతను సన్మానిస్తున్న నాయకులు

పీతల సుజాతకు అభినందనల వెల్లువ

జంగారెడ్డిగూడెం, మే 14(ఆంధ్రజ్యోతి) : మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్‌గా నియమితులైన మాజీ మంత్రి పీతల సుజాతను వీరవాసరంలోని ఆమె ఇంటివద్ద బుధవారం టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా దుశ్శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ముస్తఫా, వందనపు హరికృష్ణ, ఈర్ని సూరిబాబు, యడ్లపల్లి ఏడుకొండలు, డి.వెంకట్ పాల్గొన్నారు.



ఏలూరులో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన

ఏలూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు హెచ్‌ఐవీ నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ కళాజాతా నిర్వహిస్తున్నారు. ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు బుధవారం పలుచోట్ల కళాజాత, వీధినాటిక కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు ఎం.తిరుపతి కుమార్, వి.సుబ్బారావు, ఎం.శ్రీదివ్య, వి.వాణి, ప్రసాద్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

చింతలపూడి : హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణ పట్ల అవగాహన కల్పిస్తూ రైడీస్ ఎన్జీవో కళాజాత స్వాతి బృందం ఆధ్వర్యంలో స్థానిక కొత్తబస్టాండ్‌లో ప్రదర్శించారు. ఐసిటిసి కన్వీనర్ అశోక్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు వీధి నాటిక రూపంలో హెచ్‌ఐవీ నివారణపై వివరిస్తూ కళాకారులు ప్రదర్శన నిర్వహించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం, మే14(ఆంధ్రజ్యోతి): దిప్పకాయలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్టు జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుట్టాయగూడెం నుంచి దిప్పకాయలపాడు వచ్చే ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగిస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో వేళల్లో మార్పులు

టి.నర్సాపురం : విద్యుత్ సరఫరాలో మార్పులకు వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ బుధవారం తెలిపారు. గురువారం నుంచి 22వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 2గంటల వరకు మధ్యాహ్నపువారిగూడెం పరిధిలోని బండివారిగూడెం ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆర్‌డీఎస్ఎస్ జరుగుతున్నందున వినియోగదారులు సహకరించాలన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 416 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన గణితం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 6,683మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,350మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1106మందికి 1023మంది హాజరయ్యారని వివరించారు.



విదేశీ బృందంతో టీడీపీ నేత శ్యామ్

విదేశీ ప్రతినిధులతో టీడీపీ నేతలు

జంగారెడ్డిగూడెం, మే 14(ఆంధ్రజ్యోతి): ఏపీ సచివాలయానికి వచ్చిన విదేశీ ప్రతినిధులతో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు బుధవారం ముచ్చటించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై పరిశీలించడానికి మలైవి దేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్టు శేషు తెలిపారు. శేషుతో పాటు టీడీపీ మండలాధ్యక్షుడు, చక్రదేవరపల్లి సర్పంచ్ సాయిల సత్యనారాయణ, దుర్గారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ఏలూరు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు అస్సాం యువకులను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అస్సాంకు చెందిన రాము (25), పవన్(34)లు కలిసి భీమడోలు మండలం కోరుకొల్లులోని ఒక చేపల చెరువుపై పనిచేయడానికి ఉంటున్నారు.బుధవారం రాత్రి భీమడోలు నుంచి కోరుకొల్లుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ ట్రాక్టర్ ఢీ కొంది. తీవ్ర గాయాలకు గురైన వీరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు.

పద్మశాలీ సంఘం కార్యదర్శిగా సూర్యప్రకాశ్‌రావు



కామవరపుకోట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా పద్మశాలీ సంఘం కార్యదర్శిగా గుంటుపల్లి పంచాయతీ గొల్లగూడెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సూర్యప్రకాశ్ రావును నియమిస్తూ పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వానపల్లి నాగరాజు బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు నియామక పత్రాన్ని నాగరాజు సూర్యప్రకాశ్ రావుకు అందజేశారు. పద్మశాలీ సంఘ ప్రయోజనాలను కాపాడాలని, సభ్యులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని, అండగా ఉండి తోడ్పాటునందించాలని ఆయన సూచించారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



జంగారెడ్డిగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ-2025 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి వి.ఎస్.ఎస్.దుర్గా సాత్విక్ 500 మార్కులకు గానూ 486 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ మేరకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మద్దిపాటి చైతన్య బుధవారం విద్యార్థిని అభినందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసానికి తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు.

మూడు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

▸▸ ఉంగుటూరు, దెందులూరు, ఏలూరుకు నియామకాలు

ఏలూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు ఏడాది కాలానికి పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు జాబితాలను కూడా బుధవారం విడుదల చేసింది. గతంలో చైర్మన్ల పేర్లను ప్రకటించగా, ఈ సారి పూర్తి జాబితాలతో కమిటీలను ప్రకటించింది.

ఉంగుటూరు కమిటీ

పత్సమట్ల ధర్మరాజు(ఎమ్మెల్యే ఉంగుటూరు, గౌరవ చైర్మన్), కారేటి జ్యోతి (చైర్ పర్సన్), కూనసాని నాగేశ్వరరావు(వైస్ చైర్మన్), సభ్యులుగా అచ్యుత విజయభాస్కర సత్యనారాయణ, ఆలుమోలు వెంకట దానయ్య, గాతల సీతారత్నం, గణశాల మహాలక్ష్మి, గౌతు నాగలక్ష్మి, కొత్తపల్లి సింహాచలం, పుప్పాల మద్ది రామమ్మ, తానేటి జోగేశ్వరరావు, యాళ్ల కల్యాణి, మీసాల పార్వతిదేవి, కొలిపలి దుర్గావర ప్రసాద్, కాళ్ల సంధ్యారాణి, అడవికొలను పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, భీమడోలు ఏడీఏ, ఉంగుటూరు గ్రామ సర్పంచ్, ఏలూరు జిల్లా అగ్రి, ట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్లు ఉంటారు.

దెందులూరు..

చింతమనేని ప్రభాకర్ (ఎమ్మెల్యే దెందులూరు, గౌరవ చైర్మన్), గారపాటి రామసీత(చైర్ పర్సన్), అల్లు జ్యోతి(వైస్ చైర్ పర్సన్), సభ్యులుగా బాలిన కుమారి, చందు రంగ జవాని, దొర్రాజు బ్రమరాంబ కుమారి, గారపాటి రామకృష్ణ, మద్దాల దయానంద రాజు, మత్తే కుసుకుమారి, పసుపులేటి శ్రీరామ భార్గవ కృష్ణ, పెదపూడి వెంకట సుజాత, పుసులూరి బాల వెంకట సత్య వరప్రసాద్, వైకా సత్యనారాయణ, దారిబోయిన సత్యనారాయణ, షేక్ మౌలాలి, మేచారపు శ్రీనివాసరావు, పెదవేగి సొసైటీ స్పెషల్ ఆఫీసర్, ఏలూరు ఏడీఏ, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్, ఏలూరు జిల్లా అగ్రి, ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లుంటారు.

ఏలూరు..

బడేటి రాధాకృష్ణయ్య(ఏలూరు ఎమ్మెల్యే, గౌరవ చైర్మన్), మామిళ్లపల్లి పార్థసారథి(చైర్మన్), నడపన వాణి సూర్యకుమారి(వైస్ చైర్ పర్సన్), సభ్యులుగా అన్నవరపు పద్మ, గేదెల లక్ష్మీదుర్గ, కావూరి వాణిశ్రీ, కిల్లి లలిత, మోదుగుల మాణిక్యాలరావు, మారగాని రాము, రామిశెట్టి శ్రీనివాసరావు, రావూరి జయలక్ష్మి, షేక్ హబీబున్నీసా, తుమ్మల పార్వతి నాగేశ్వరరావు, ఆకుల నారాయణమ్మ, జంగం కృపానందం, ఏలూరు టౌన్ రైతుల సంఘం ప్రెసిడెంట్, ఏలూరు ఏడీఏ, నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్, ఏలూరు జిల్లా అగ్రి, ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్లులుంటారు.

సమ్మె నోటీసు అందజేత

నూజివీడు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు మునిసిపల్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి నోటీసులు అందించారు. సీఐటీయూ కార్యదర్శి జి.రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, రజిని, ఏసు తదితరులు ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలియచేస్తూ సమ్మె నోటీసును అందించారు.

నేడు చాట్రాయిలో ప్రజా దర్బార్

చాట్రాయి, మే 14(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు హాజరై తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేస్తే సంబంధిత అధికారులు రసీదు అందజేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

మోదీ ప్రభుత్వంలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

నూజివీడు, మే 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూజివీడు అమర్‌భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ నూజివీడు అధ్యక్షులు అక్కినేని రాజా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి కార్మికచట్టాలను నిర్వీర్యం చేస్తూ లేబర్‌కోడ్‌లను ప్రవేశపెడుతోందన్నారు. ఎంతోకాలం పోరాడి, బ్రిటీష్ కాలంలో సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు తోటా వెంకట్రావు, వాకా రాంబాబు, బి.వెంకటేశ్వరరావు, బి.క్రాంతి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సాగర్



జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న పరిమి సాగర్

నూజివీడు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి):ఏలూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా పరిమి సాగర్‌కుమార్ ఎన్నిక అయ్యారు. నూజివీడు కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు పరిమి సాగర్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందించారు. నూజివీడు నియోజకవర్గానికి చెందిన గోపే మురళీ, మల్లెల వెంకటేశ్వరరావు, వీరరాఘవులు కార్యదర్శులుగా ఎన్నిక కాగా మండల అధ్యక్షుల నియామకాలను బుధవారం నిర్వహించారు. ఆగిరిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా చీకటి రాజు, చాట్రాయి మండల అధ్యక్షునిగా అమిరిశెట్టి వెంకటేశ్వరరావు, ముసునూరు మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా సూర్యదేవర వెంకటవరప్రసాద్, నూజివీడు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా యార్లగడ్డ ఆంజనేయులు నియమితులు అయ్యారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



కైకలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం ఆచవరంలో గుర్తు తెలియని యువకుని మృతదేహం లభించింది. బుధవారం కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఆచవరం రైల్వే గేటు దాటిన తరువాత ఉన్న రోడ్డు సైడ్ ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు కలిగిన యువకుడు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. స్థానిక ప్రజలు గుర్తించి హుటాహుటీన అతనికి సహాయాన్ని అందించారు. అనంతరం అతని నుంచి సమాచారాన్ని అడిగితే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ సమాధానం ఇచ్చాడని, కొద్దిసేపటికి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్ళి స్పృహతప్పి పడిపోయాడు. దీంతో స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది పరీక్షించి అతను మృతి చెందినట్లుగా గుర్తించారు. ఈ సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేశారు. అతను ఫిట్స్ వచ్చి పడిపోయినట్లుగా స్థానికులు వివరించారు. మృతి చెందిన యువకుడి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉందని, యువకుడు ఛామనిఛాయ రంగులో ఉండి బ్లూ రంగు టీ షర్టు, షాట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. యువకుడు తెలుగులోనే మాట్లాడారని ఈ అనమాలు గుర్తించి ఎవరికైనా తెలిస్తే సెల్ 9440796424, 9440793433 నెంబర్లను సంప్రదించాలని సీఐ కోరారు.

కల్వర్టులు లేని కాలువలతో ప్రమాదాలు



చావలిపాడు కాలువపై శిథిలమైన కల్వర్టు

మండవల్లి మే 14(ఆంధ్రజ్యోతి):రహదారుల వెంట కల్వర్టు లేని కాలువలు ప్రమాదాలకు కాచుకుని కూర్చున్నాయి. వాహన చోదకులు చిన్న తప్పిదం చేసిన వెంటనే ప్రాణాలపై ఆశలను వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో మార్జిన్ కనిపించలేదా అంతే ఇంకా ఆసుపత్రి పాలవ్వాల్సిందే. అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం ఎంతో మంది చోదకులకు ప్రాణ సంకటంలా తయారవుతున్నాయి. ఇటీవల చావలిపాడు వద్ద రోడ్డు మార్జిన్లు లేకపోవడంతోనే ఓ మహిళ ప్రాణాలను కోల్పో వల్సి వచ్చింది. రహదారులను దాటుతూ పోయే కాల్వలకు కల్వర్టులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కాలువలు ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్త...

కాలువలు ఉన్న ప్రాంతంలో కనీస మార్జిన్ లేకపోవడంతో వాహనాలు జారి కాల్వలోనికి పడి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా మండవల్లి మండలంలోని అన్ని కాల్వలకు ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా 165జాతీయ రహదారికి ఇదే పరిస్థితి నెలకొనడంతో నిత్యం ఎంతో మంది ప్రయాణికులు ప్రమాదాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. కనీసం కాలువలు ఉన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లాంటివి ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాదారులు కాలువల్లో పడిగాయాలపాలవుతున్నారు.

ప్రమాదకరంగా పోల్‌రాజ్ డ్రెయిన్ వంతెన

కాకతీయనగర్ పోల్‌రాజ్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన ఇరువైపులా రక్షణకు ఏర్పాటు చేసిన ఐరన్ కమ్మిలు విరిగిపోయి దారుణంగా తయారయ్యాయి. ఏమాత్రం వాహనదారులు ఆదమరిచి ఉంటే నేరుగా డ్రెయిన్‌లో వాహనంతో సహా పడిపోయే పరిస్థితి నెలకొంది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు దీనిపై ప్రజలు మొత్తుకున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. జలవనరులశాఖ డీఈ శిరీషాను వివరణ కోరగా వెంటనే పరిశీలించి రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు

రద్దు కానున్న పాఠశాలల విద్యార్థులపై ప్రైవేట్ కన్ను



వణుదుర్రు యూపీ స్కూలు

ముదినేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పునర్వవస్థీకరణలో భాగంగా ముదినేపల్లి మండలంలోని అన్ని యూపీ పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా డి గ్రేడ్ కావటంతో 6, 7, 8 తరగతుల విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నారు. మడలంలో రద్దు కాబోతున్న యూపీ పాఠశాలల్లో 1 నుంచి 5 వరకు మాత్రమే తరగతులు ఉంటాయి. 6, 7, 8 తరగతుల విద్యార్థులు వివిధ హైస్కూళ్లకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే మండలంలో 9 యూపీ పాఠశాలలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారటంతో ఆయా పాఠశాలలకు చెందిన 6, 7, 8 త రగతుల విద్యార్థులు సుమారు 3 కిలోమీటర్ల నుంచి 9 కిలోమీటర్ల దూరంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లకు వెళ్లాల్సి వస్తున్నది. చాలా గ్రామాల విద్యార్థులు హైస్కూళ్లకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం కానీ, బస్ సౌకర్యం కానీ లేదు. దీంతో ఇప్పటి వరకు గ్రామంలోనే ఉన్న యూపీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదివిన విద్యార్థులు, ఇక ముందు దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్లేదెలా అన్న విషయమై ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడ తమ పిల్లలను హైస్కూళ్లకు ఎలా పంపాలన్న విషయమై తర్జన భర్జన పడుతున్న పరిస్థితుల్లో మండలంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థలు రంగంలోకి దిగాయి. రద్దు కాబోతున్న యూపీ పాఠశాలల గ్రామాలకు ఇప్పటికే పలు ప్రైవేట్ పాఠశాలల వాహనాలు వెళ్తున్నాయి. ఆ వాహనాల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులను కూడ తీసుకెళ్లేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో యాజమాన్యాలు మాట్లాడుతున్నాయి. అంతేకాక ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం సొమ్ము ఫీజుగా చెల్లించి, వాహనాల ఫీజు మాత్రమే కట్టమని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో ప్రస్తుత యూపీ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకే పంపేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో మండలంలో రద్దు కాబోతున్న యూపీ పాఠశాలల నుంచి ఎక్కువ శాతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మూడు మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలు

ఏలూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు ఏడాది కాలానికి పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు జాబితాలను కూడా బుధవారం విడుదల చేసింది. గతంలో చైర్మన్ల పేర్లను ప్రకటించగా, ఈ సారి పూర్తి జాబితాలతో కమిటీలను ప్రకటించింది.

ఉంగుటూరు కమిటీ

పత్సమట్ల ధర్మరాజు(ఎమ్మెల్యే ఉంగుటూరు, గౌరవ చైర్మన్), కారేటి జ్యోతి (చైర్ పర్సన్), కూనసాని నాగేశ్వరరావు(వైస్ చైర్మన్), సభ్యులుగా అచ్యుత విజయభాస్కర సత్యనారాయణ, ఆలుమోలు వెంకట దానయ్య, గాతల సీతారత్నం, గణశాల మహాలక్ష్మి, గౌతు నాగలక్ష్మి, కొత్తపల్లి సింహాచలం, పుప్పాల మద్ది రామమ్మ, తానేటి జోగేశ్వరరావు, యాళ్ల కల్యాణి, మీసాల పార్వతిదేవి, కొలిపల్లి దుర్గావర ప్రసాద్, కాళ్ల సంధ్యారాణి, అడవికొలను పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, భీమడోలు ఏడీఏ, ఉంగుటూరు గ్రామ సర్పంచ్, ఏలూరు జిల్లా అగ్రి, ట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్లు ఉంటారు.

దెందులూరు :

చింతమనేని ప్రభాకర్ (ఎమ్మెల్యే దెందులూరు, గౌరవ చైర్మన్), గారపాటి రామసీత(చైర్ పర్సన్), అల్లు జ్యోతి(వైస్ చైర్ పర్సన్), సభ్యులుగా బాలిన కుమారి, చందు రంగ జవాని, దొర్రాజు భ్రమరాంబ కుమారి, గారపాటి రామకృష్ణ, మద్దాల దయానంద రాజు, మత్తే కుసుకుమారి, పసుపులేటి శ్రీరామ భార్గవ కృష్ణ, పెదపూడి వెంకట సుజాత, పుసులూరి బాల వెంకట సత్య వరప్రసాద్, వైకా సత్యనారాయణ, దారిబోయిన సత్యనారాయణ, షేక్ మౌలాలి, మేచారపు శ్రీనివాసరావు, పెదవేగి సొసైటీ స్పెషల్ ఆఫీసర్, ఏలూరు ఏడీఏ, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్, ఏలూరు జిల్లా అగ్రి, ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లుంటారు.

ఏలూరు :

బడేటి రాధాకృష్ణయ్య(ఏలూరు ఎమ్మెల్యే, గౌరవ చైర్మన్), మామిళ్లపల్లి పార్థసారథి(చైర్మన్), నడపన వాణి సూర్యకుమారి(వైస్ చైర్ పర్సన్), సభ్యులుగా అన్నవరపు పద్మ, గేదెల లక్ష్మిదుర్గ, కావూరి వాణిశ్రీ, కిల్లి లలిత, మోదుగుల మాణిక్యాలరావు, మారగాని రాము, రామిశెట్టి శ్రీనివాసరావు, రావూరి జయలక్ష్మి, షేక్ హబీబున్నీసా, తుమ్మల పార్వతి నాగేశ్వరరావు, ఆకుల నారాయణమ్మ, జంగం కృపానందం, ఏలూరు టౌన్ రైతుల సంఘం ప్రెసిడెంట్, ఏలూరు ఏడీఏ, నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్, ఏలూరు జిల్లా అగ్రి, ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్లుంటారు.

మట్టి పరీక్షలతో రైతులకు ఉపయోగాలు



సోమవరంలో మట్టి నమూనాల సేకరణ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

చాట్రాయి, మే 14(ఆంధ్రజ్యోతి): మట్టి పరీక్షల ఉపయోగాలను రైతులందరూ తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా కోరారు. మండలంలోని సోమవరం గ్రామంలో బుధవారం మట్టి నమూనాలు సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షల వలన భూమిలో ఉన్న పోషక విలువలు గర్తించి, ఏ మోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకొని పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చునని, భూమికి అనువైన పంటలు ఏమిటో కూడా గుర్తించవచ్చునని అన్నారు. ఒక ఎకరం భూమిలో 4 నుంచి 6 చోట్ల మట్టి నమూనాలు సేకరించి క్వార్టరింగ్ పద్ధతిలో అర కేజీ వచ్చే వరకు చేసి ల్యాబ్‌కి పరీక్ష నిమిత్తం పంపాలని అన్నారు. మట్టి నమూనాలు చెట్ల నీడ కింద, గట్లు, పేడ పోగులు, ఎరువు కుప్పల వద్ద తీయరాదని అన్నారు. కార్యక్రమంలో ఏవో శివ శంకర్, ఆర్ఎస్‌కె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు మండలం సూరేపల్లి రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా, సీసీఆర్‌సీ కార్డుల నమోదు, భూసార పరీక్షల ప్రక్రియ తదితర వాటిపై వ్యవసాయ సిబ్బందితో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మట్టి నమూనా సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా హబీబ్ బాషా మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలో ఉన్న నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్‌తోపాటు సేంద్రియ కర్బన పదార్థం నిష్పత్తులను రైతులు తెలుసుకొని అధికంగా వాడే కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ముసునూరు మండలంలో 1200 మట్టి నమూనాలను లక్ష్యంగా ఇవ్వగా ఇప్పటి వరకు 600 మట్టి నమూనాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన నమూనాలను త్వరిగతిన సేకరించి, ఫలితాల కోసం ల్యాబ్‌కు పంపేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కె.సీహెచ్ సూరిబాబు, ఏఈవో రామకృష్ణ, విహెచ్ఏలు, వివిఏలు, రైతులు పాల్గొన్నారు.



పంటబోదెను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, రెవెన్యూ అధికారులు

పంట బోదెలు పూడ్చివేస్తే కఠిన చర్యలు

కైకలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. బుధవారం కైకలూరు మండలం వేమవరప్పాడులో చేపలచెరువులు మరమ్మతులు చేస్తూ పంటబోదెను పూడ్చివేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి బోదెను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పంటబోదెలను చెరువుల తవ్వకాల పేరుతో ఆక్రమణలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు స్వార్థంతో కాలువలను, పంటబోదెలను ఆక్రమిస్తే దిగువన ఉన్న రైతులకు నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అనంతరం గ్రామసచివాలయంలో నీటితీరువ పన్ను వసూళ్ళను వేగవంతంగా చేయాలని, డిజిటల్, నగదు రూపేణా ఈ శిస్తు వసూళ్ళను స్థానిక వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్‌లు కట్టించుకోవాలని ఆదేశించారు. నగదు రూపేణా ఎవరైనా రైతులు కడతానంటే రశీదు రాసి తక్షణమే రైతులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వరరావు, వి వెంకటేశ్వరరావు, వీఆర్వో రంగనాయకమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామ కమిటీ ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

టీడీపీ ఆగిరిపల్లి అధ్యక్షుడిగా పామర్తి

ఆగిరిపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి గ్రామంలో మంగళవారం టీడీపీ సమావేశం ఏర్పాటుచేసి గ్రామ అధ్యక్షుడు ఎన్నికలు నిర్వహించారు. కమిటీ పరిశీలకులుగా నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, తుమ్మల ఆది, బత్తుల మాధవరావు ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించారు. ఆగిరిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడుగా పామర్తి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా సగ్గుర్తి లక్ష్మణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



చాట్రాయి సబ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

విద్యుత్ అక్రమ వినియోగదారులకు రూ.8.73 లక్షల జరిమానా

చాట్రాయి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్రమ వినియోగదారులకు రూ.8.73 లక్షలు జరిమానా విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(విజిలెన్స్) విజయకుమారి, నూజివీడు ఈఈ సత్యనారాయణ, విస్సన్నపేట డీఈఈ సోమేశ్వరరావు తెలిపారు. తనిఖీలు అనంతరం చాట్రాయి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అధికారులు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 2660 విద్యుత్ సర్వీసులు తనిఖీ చేసి, మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఏడుగురికి రూ.98 వేలు, అనుమతించిన లోడ్ కంటే అధికంగా కరెంట్ వినియోగిస్తున్న 210 మందికి రూ. 6.92 లక్షలు, శాంక్షన్ కేటగిరిలో కాకుండా వేరే కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 9 మందికి రూ.93 వేలు మొత్తం రూ.8.73 లక్షలు జరిమానా విధించామని అన్నారు. ఈ దాడుల్లో నూజివీడు డివిజన్‌లోని అసిస్టెంట్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా..18 మందికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై తరకటూరుపాలెం వద్ద బుధవారం ఆటో బోల్తా కొట్టిన సంఘటనలో 18 మందికి గాయాలయ్యాయి. ఎస్సై కె.ఎన్.వి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన కొందరు మచిలీపట్నంలో ఓ కార్యక్రమానికి మూడు ఆటోల్లో బయలుదేరారు. గన్నవరం వచ్చేసరికి ఒక ఆటో పాడయిపోవడంతో అందులోని ప్రయాణికులు ప్రమాదం జరిగిన ఆటోలో ఎక్కారు. ఆ ఆటో తరకటూరుపాలెం వద్దకు వచ్చేసరికి హ్యాండిల్‌కు ఆటోలోని ఓ వ్యక్తి కాలు తగలడంతో హ్యాండిల్ తిరగక ఆటో పక్కకు బోల్తా కొట్టింది. ఆటోలో 9 మంది పెద్దలు, 9 మంది పిల్లలు ఉన్నారు. డ్రైవర్ ఎల్.శివరామప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ, బ్లెస్సి, శిరీష, చైతన్య, సుజాత, గణేష్, బేబీ, వెంకటేశ్వరరావు, హర్షిత, హనుమంతరావు, రోశమ్మ, హరిచందన, కుమారి, ఆద్య, వంశీ, చైతన్యకు గాయాలయ్యాయి. ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక అవసరాలు పిల్లల గుర్తింపు శిబిరం



ఎంపీడీవో సత్యనారాయణకు జీవో కాపీని అందజేస్తున్న ఐఈఆర్పీలు

ముసునూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్పీ డి.ఎం.వి లక్ష్మీనారాయణ రావు తెలిపారు. ఈ శిబిరాలపై ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీని బుధవారం ఎంపీడీవో బి.ఏ సత్యనారాయణకు ఐఈఆర్పీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే క్యాంప్‌ను ఈ నెల 13 నుంచి జూన్ 9వతేదీ వరకు జరుగుతుందన్నారు. అయితే అయా గ్రామాల సోషల్ హెల్పర్ ఆసిస్టెంట్లు దివ్యాంగ పిల్లల సమాచారాన్ని అందజేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఎక్కడ ప్రత్యేక అవసరాల పిల్లలను వదిలిపెట్టకుండా గుర్తించి, వారికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలు, ఉపకరణాలను అందించేలా ఐఈఆర్పీలు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ జె.నాగమల్లేశ్వరీ, సీనియర్ అసిస్టెంట్ సగ్గుర్తి శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ధ్రువపత్రాలు స్వీకరించాలి

కలిదిండి, మే 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ లేని వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ధ్రువపత్రాలను స్వీకరించాలని నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం కోరుకొల్లులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరించటం ఆనందదాయకమన్నారు. ఈ ప్రక్రియలో మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఆన్‌లైన్ బ్రోకర్ మాఫియా రెచ్చిపోతుందన్నారు. లేటు రిజిస్ట్రేషన్ మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం అమాయకులను టార్గెట్ చేసి రూ.4 వేల నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వివాహ ధ్రువీకరణ పత్రం లేని దంపతులకు ఇతర ధ్రువీకరణ పత్రాలైన వెడ్డింగ్ కార్డు, నోటరీ, మ్యారేజ్ డిక్లరేషన్ లేదా వీఆర్వో, తహసీల్దార్ ద్వారా పొందిన గుర్తింపు పత్రాలను ఆధారంగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించాలని ఆయన కోరారు.

భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి



కాళ్లపాలెంలో భూ రికార్డుల డేటా ఎంట్రీ పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

కలిదిండి, మే 14 (ఆంధ్రజ్యోతి): భూ రీ సర్వే పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళ్లపాలెంలో భూ రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భూ రీ సర్వే పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. భూ రికార్డులకు సంబంధించి డేటా ఎంట్రీ సక్రమంగా చేయాలన్నారు. రీ సర్వేలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ షమీ, వీఆర్వో పమిడేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథల పఠనం



కలిదిండి, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం కలిదిండి గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు పఠనం నేర్పించారు. అనంతరం నీతి కథలను బోధించి పద్యాలను చదివించారు. కోరుకొల్లు గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నేర్పించారు. గ్రంథాలయాధికారులు రమేష్‌బాబు, రాఘవులు పాల్గొన్నారు.



గన్నిని కలిసిన టీడీపీ నాయకులు

ముదినేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులును బుధవారం కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆప్కాబ్ చైర్మన్‌గా నియమితులైనందుకు ఆయనను సత్కరించి, అభినందించారు. తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజయం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహన్‌రావు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోసిన పాండురంగారావు తదితరులు గన్ని వీరాంజనేయులును ఏలూరులో కలిశారు.

వార్తా పత్రికల పఠనం



ముదినేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని శాఖా గ్రంథాయలంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో వార్తా పత్రికలు పఠనం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి వార్తా పత్రికలను నిత్యం చదవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దేశ, రాష్ట్ర రాజకీయ, ఆర్థిక అంశాలతోపాటు ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు తెలుస్తాయన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై విజ్ఞానం పెరుగుతుందని వివరించారు.